# ప్రజాశక్తి

సోమవారం 15 జులై 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

బోటుపై బకింగ్ హామ్ కెనాల్ లో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

## పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు

### బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

**ప్రజాశక్తి - నిజాంపట్నం,బాపట్ల జిల్లా**

బాపట్ల జిల్లాలో పర్యాటక , ఆక్వా రంగం అభివద్ధికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. సూర్యలంక ఆదర్శనగర్ బ్రిడ్జి వద్ద నుంచి నిజాంపట్నం హార్బర్ వరకూ బకింగ్ హామ్ కెనాల్‌లో 14 కిలోమీటర్ల మేర మోటరైజ్డ్ బోట్‌లో కలెక్టర్ ఆదివారం పర్యటించారు. మత్స్యకారుల వేట, స్థితిగతులు, నిజాంపట్నం హార్బర్ నిర్మాణ పనులు, ఆక్వా పార్కు ప్రతిపాదిత ప్రాంతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. హార్బర్‌లో బోట్లు నిలుపుదల చేసే జెట్టి, మత్స్య సంపద గ్రేడింగ్ చేసి ప్రాంతాలను పరిశీలించారు మత్స్య శాఖ అధికారులు, మత్స్యకారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సముద్రంలోని వనరులు అందుబాటులోకి తెచ్చి మత్స్య సంపదను అభివద్ధి చేస్తామని తెలిపారు. పర్యాటక రంగం అభివద్ధికి ఇది చాలా అనువైన ప్రాంతమన్నారు. పర్యాటక రంగ అభివద్ధికి అన్ని వనరులు అంద ుబాటులో ఉన్నాయన్నారు. తాము మడ అడవుల పరిశీలన కోసం వచ్చామన్నారు. 192 ఎకరాలలో ఆక్వా పార్కు అభివద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పార్కు

▶ 2లో

## నేడు బాలినేని ఒంగోలు రాక

- శ్రీనివాసరెడ్డి దెబ్బకు చెవిరెడ్డి ఎంపికపై వెనక్కి తగ్గిన జగన్
- భవిష్యత్ రాజకీయాలపై పార్టీవర్గాలతో సంప్రదింపులు చేసేయోచన
- ఒంగోలు నగర పాలకవర్గాన్ని కాపాడుకునే అంశంపైనే ప్రధాన దృష్టి

**ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో**

ఎన్నికల కౌంటింగ్ రోజున హైదరాబాదు వెళ్లిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం ఒంగోలు వస్తున్నారు. రాష్ట్రంలో వైసిపి ఓటమితో అధికారం పోయింది. దీంతో మాజీ మంత్రి బాలినేని కూడా అక్కడే ఉండిపోయారు. మాజీ సిఎం జగన్‌ను కూడా కలిసినట్లు లేదు.అధికార మార్పిడి జరిగి నెలరోజులు దాటిపోయింది. అన్ని నియోజకవర్గాల్లో పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులు వచ్చి కార్యకర్తలను కలిసి ఏదోఒకటి మాట్లాడుతున్నారు. బాలినేని మాత్రం ఇప్పటి వరకూ రాలేదు.కొందరు అక్కడికే వెళ్లి కలిసి వచ్చారు.తాజాగా చోటు చేసుకున్న కొన్ని పరిణామాలతో బాలినేని ఒంగోలు వస్తున్నారు. జిల్లా అధ్యక్షుడి మార్పు విషయం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం జంకెవెంకటరెడ్డి ఈ బాధ్యతలోఉన్నారు. ఎన్నికల్లో ఓడిపోయాక పార్టీలో ప్రక్షాళన చేపట్టాలనే ఆలోచనలో ఉన్న వైసిపి అధినేత జగన్ జిల్లా అధ్యక్షులు, ఇన్‌ఛార్జిలను మార్పులు చేర్పులు చేసేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా ఒంగోలు పార్లమెంట్‌కు పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కరరెడ్డిని పెట్టాలని జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని మాజీ మంత్రి బాలినేని తీవ్రంగా వ్యతిరేకించారు.ఎక్కడో పక్క జిల్లాల వారిని తెచ్చి పెడితే ఇక్కడ తమ పరువు ఉంటుందా? లేదా?అనే ధోరణిలో ధిక్కార స్వరం వినిపించారు. ఇదే జరిగితే తాను రాజీనామా చేస్తాననే సంకేతాలు ఇచ్చారు. దీంతో వైసిపి అధినేత జగన్ వెనుక్కితగ్గినట్లు తెలుస్తోంది. ఎందుకంటే హైదరాబాదులో ఉన్న బాలినేనితో సజ్జల శనివారం కలిశారు. తాజా పరిణామాలపై చర్చించారు. అన్ని విషయాలు చర్చించారు. దీంతో చెవిరెడ్డి విషయంలో ప్రస్తుతానికి వెనుక్కి తగ్గినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షుడిగా కొంత కాలం జంకే వెంకటరెడ్డినే కొనసాగించాలనే ఆలోచనలో మాజీ మంత్రి బాలినేని ఉన్నారు. ఇపుడు నెలరోజులకే మార్చాల్సిన అవసరం ఏముందనే అభిప్రాయాన్ని పార్టీ పెద్దల ఎదుట అన్నారు. ఏదేమైనా ప్రస్తుతానికి ఈ వ్యవహారం పక్కకు పోయింది. ఇక బాలినేని ఒంగోలు రాక నేపథ్యంలో ఇక్కడ కొన్ని కీలక అంశాలపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని పార్టీవర్గాల్లో చర్చ సాగుతోంది. మొత్తం ఆయన రాజకీయ భవితవ్యంపైనే పలు రకాలుగా చర్చలు ఊహాగానాలు సాగుతున్న తరుణంలో కార్యకర్తలు, ముఖ్యులతో భేటీలు నిర్వహిస్తారని చెబు తున్నారు. ఆయన రాజకీయ భవితవ్యంపై ఎలాంటి నిర్ణయాలు ఉంటాయనే దానిపైనా ఉత్కంఠగా చర్చ సాగుతోంది. ఇక నగరపాలక సంస్థలో పాలకవర్గాన్ని కాపాడుకోవడం ఇపుడు ఆయన ముందున్న ఎజండా? ఎన్నికలకు ముందే కొందరు కార్పొరేటర్లు జారిపోగా.. ఇపుడు ఒక్కొక్కరుగా క్యూకట్టారు.టిడిపి

▶ 2లో

## ఆలస్యంగా ఖరీఫ్ సాగు

- పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- వరి సాగు సాధారణ విస్తీర్ణం 1,03,790 హెక్టార్లుగా అంచనా

ఈ పాటికే ఎదపెట్టిన వరిపైరు

**ప్రజాశక్తి - బాపట్ల జిల్లా**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు మాగాణి పంటలకు జీవం పోశాయి. జిల్లాలోని వేమూరు, కొల్లూరు, బట్టిప్రోలు ప్రాంతాల్లో వరి విత్తనాలు వెదజల్లిన రైతులు మాత్రం వర్షాల కారణంగా ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలా రోజులు గడుస్తుంది. అయినప్పటికీ వర్షాలు సక్రమంగా పడలేదు. జలాశయాల్లో నీరు లేక రైతులు వ్యవసాయ పనులు చేపట్టేందుకు సందేహించారు. పట్టిసీమ నుంచి కృష్ణా బ్యారేజికి నీటి విడుదల జరగడం, అక్కడి నుంచి కృష్ణా కాలువ ద్వారా పశ్చిమ డెల్టాకు నీటి విడుదల కావడం రైతులు సాగుకు సమాయత్తం అయ్యారు. తొలుత తాగునీటి అవసరాల కోసం రాష్ట ప్రభుత్వం నీటిని విడుదల చేసింది. కాలువల లోకి నీరు రావడంతో వేమూరు,రేపల్లే, బాపట్ల వ్యవసాయ డివిజన్ల పరిధిలో రైతులకు వరినార్లు పోసుకునే అవకాశం లభించింది. కొందరు రైతులు వర్షాలు ఆలస్యం కావడంతో వరి విత్తనాలను వెదజల్లారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా మెలక దశలో ఉన్న వరిపైరుకు నష్టం వాటిల్లే పరిస్థితి తలెత్తింది. వేమూరు నియోజకవర్గంలో సుమారు 10 వేల ఎకరాల్లో వరి గింజలు భూమిలో ఉన్నాయి. కొన్ని విత్తనాలు మొలకలు వచ్చాయి. ప్రస్తుతం కాలువల్లోకి నీరు రావడం, వర్షాలు పడుతుండటంలో వరినార్లు పోసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని మాగాణి భూముల్లో వర్షపు నీరు అధికంగా చేరడంతో నార్లు పోసేందుకు ఆలస్యం అయ్యే పరిస్థితి ఏర్పడింది. గత కొద్ది రోజులుగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు దుక్కులను సాగుకు సిద్ధం చేస్తున్నారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో ఆరుతడుల కింద కంద, పసుపు పంటలను సాగు చేశారు.ఈ ప్రాంతంలో బోర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. దీంతో రైతులు జూన్ నెలలోనే వ్యవసాయ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మెట్ట పంటల సాగుకు కూడా అనుకూలంగా ఉంటాయి. దీంతో పత్తి, మిరప పంట సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యవసాయశాఖ రూపొందించిన ఖరీఫ్

▶ 2లో

## ప్రభుత్వ భూమి మాయం

### అక్రమార్కులకు అధికారుల అండ

**ప్రజాశక్తి-మార్కాపురం**

మార్కాపురం పట్టణానికి కూతవేటు దూరంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూములు ఇటీవల కాలంలో మాయ మవ ుతున్నాయి. రూ. కోట్ల ఖరీదైన భూములను అప్ప నంగా కొట్టే యాలనుకున్న ఘనులకు అధికారులు అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రూ. కోట్ల ఖరీదైన ప్రభుత్వ భూములను సైతం పెద్దలు కొందరు హక్కు పత్రాలతో సొంతం చేసుకుంటున్నారు.

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన అసైన్డ్ భూమి

వేములకోట గ్రామం మార్కాపురం పట్టణానికి కూతవేటు దూరంలో ఉంది. పట్టణ ప్రాంతం ఆ గ్రామ ఇలాఖాలోకి చేరింది. దీంతో అక్కడి భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. మార్కాపురం జిల్లా అవుతుందని, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కానుందని ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రధాన రహదారికి ఇరువైపులా ఎకరం భూమి ధర రూ. 2 కోట్లు పలుకుతోంది. భూమి ధర పెరగడంతో అసైన్డ్ భూమిగా మిగిలి ఉన్న వాటిపై కొందరు పెద్దల కన్ను పడింది.

తొలుత అసైన్డ్ భూమిగా పట్టా పొందారు. రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం ఆ పట్టా పొందేది పేదలా కాదా అనేది చూడలేదు. పెద్ద మొత్తంలో ముడుపులు ఇవ్వడంతో ఖరీదైన భూమిని కట్టబెట్టారు. మరో సర్వే నెంబరు సృష్టించి అసైన్డ్ భూమిని కాస్తా పట్టాభూమిగా రిజిష్టర్ చేశారు. ఇప్పుడా ప్రభుత్వ భూమి నలుగురు చేతులు మారింది. ఒరిజినల్ పట్టా భూమిగా మారడంతో ఆక్రమిత ప్రభుత్వ భూమి ఖరీదు రూ. 2 కోట్లకు చేరింది. వేములకోట ఇలాఖాలోని సర్వే నెంబరు 461/1ఎ.లో 0.50 సెంట్లు భూమిలో జరిగిన తతంగం ఇదీ. సర్వే నెంబరు 461/1బి.లో 0.50 సెంట్లు ఉంది. ఇది పక్కా అసైన్డ్ భూమి. కంభం-

▶ 2లో

## పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతం ఎంతో ప్రాచుర్యం పొందుతుందన్నారు. 100 ఎకరాలు పార్కు కోసం కేటాయించేలా ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతి రావాల్సి ఉందన్నారు. ఈ అంశంపై రెవెన్యూ మంత్రితో మాట్లాడామని, ఆయన సాను కూలంగా స్పందించి తక్షణమే అంగీకారం తెలిపారన్నారు. అనుమతి రాగానే అభివద్ధి పనులు ప్రారంభమవుతాయన్నారు. నిజాంపట్నం హార్బర్‌లో అభివద్ధి పనులు జరుగుతున్నాయని, 2.5 హెక్టార్ల అటవీ భూమిని భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. గుంటూరు జిల్లా దుర్గికి 90 ఎకరాలు ఇస్తే 100 ఎకరాలు బాపట్ల జిల్లాలో వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. బాపట్ల జిల్లాలో బీచ్‌ల వద్ద మరణాలు పూర్తిగా అరికట్టేలా చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. ఇప్పటికే ఆయా తీర ప్రాంతాలలో పర్యటించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామన్నారు. తుఫాను, పర్యావరణ విపత్తుల సమయంలో మత్స్యకార గ్రామాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. బాపట్ల జిల్లా తీర ప్రాంతం సరిహద్దులను పరిశీ లించినట్లు కలెక్టర్ వివరించారు. మత్స్యకారుల అనుభవాలను గుర్తిం చామన్నారు. కలెక్టర్ వెంట మత్స్యశాఖ జిల్లా అధికారి పి సురేష్, బాపట్ల ఆర్‌డిఒ జి.రవీందర్, మత్స్య శాఖ అధికారులు ఉన్నారు. నిజాంపట్నం హార్బర్ సందర్శన బాపట్ల జిల్లా కలెక్టర్‌ను నిజాంపట్నం బోటు యూనియన్ ప్రెసిడెంట్ మోపిదేవి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు బొమ్మిడి రామకష్ణ కలిసి స్థానిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

## ఆలస్యంగా ఖరీఫ్ సాగు

(మొదటిపేజీ తరువాయి)

సాగు ప్రణాళిక ప్రకారం ఖరీఫ్‌లో వరి సాగు సాధారణ విస్తీర్ణం 1,03,790 హెక్టార్లుగా అంచనా వేశారు. ఆహార ధాన్యాలు,వాణిజ్య పంటలు కలిపి 1,41,916 హెక్టార్లల్లో పంటల సాగు ఉంటుందని భావిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో ఖరీఫ్‌లో 1,53,136 హెక్టార్లలో వరి పంట సాగు జరగాల్సి ఉండగా సకాలంలో వర్షాలు పడక, ప్రకృతి అనుకూలించక 1,07,877 హెక్టార్లలో వరి సాగు చేశారు. పట్టిసీమ నుంచి నీరు వచ్చే అవకాశం ఉండటం, ప్రకృతి సహకరిస్తే జిల్లాలో ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

## నేడు బాలినేని ఒంగోలు రాక

(మొదటిపేజీ తరువాయి)

చేరుతున్నారు.. మెజార్టీ కార్పొరేటర్లు వచ్చాక పాలకవర్గాన్ని మార్చేయాలనే ఆలోచనలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. పాలవర్గం తమకు అనుకూలమైనదిగా చేసుకునేందుకు దామచర్ల వ్యూహం అమలు చేస్తున్నారు. పైగా మేయర్ కూడా టిడిపి నేతలతో టచ్‌లోకి వెళ్లినట్లు చాలా కాలంగా ప్రచారం సాగుతోంది. దీన్ని ఏ మేరకు మాజీ మంత్రి బాలినేని అడ్డుకుంటారన్నదే చూడాలి. ఎందుకంటే అధికారం లేనందున ఇక్కడ ఎవరూ నిలబడే పరిస్థితి కనిపించడం లేదు. బాలినేని ఇక్కడే ఉండి పార్టీని కాపాడుకునే చర్యలు తీసుకుంటే తప్ప ఇక్కడ క్యాడర్ నిలబడే పరిస్థితి కనిపించడం లేదు. ఎన్నికల ఫలితాల తర్వాత చాలామంది పట్టణానికి దూరంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఒంగోలులో తనపై దురుసుగా ప్రవర్తించిన వారిపై ఎమ్మెల్యే దామచర్ల కూడా తనదైన శైలిలో దృష్టి సారించడం కూడా కీలకాంశం. రిమ్స్‌లో జరిగిన సంఘటనపై దామచర్ల ఇప్పటికీ గుర్రుగానే ఉన్నారు. ఇవన్నీ ఇపుడు వైసిపి నేతలకు సవాళ్లుగా మారాయి. వీటన్నిటినీ ఇపుడు మాజీ మంత్రి బాలినేని ఎదుర్కొని నిలబడాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో బాలినేని లేకపోవడంతో అందరూ నైరాశ్యంతోనే ఉన్నారు. ఓడిపోయిన నేతలు కూడా నియోజకవర్గాల్లో క్రియాశీలకంగా కనిపించడం లేదు. పైగా పాత నియోజకవర్గాలకు వెళ్లి పనిచేసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. అందరినీ నడిపించే పాత్రలోనూ ఎవరూ కనిపించలేదు. అందరూ ఓటమి బాధలోనే ఇప్పటికీ ఉన్నారు. ఇదే దిశగా ఇన్‌ఛార్జుల ను మార్పులు చేర్పులు చేసే అవకాశాలు కూడా చేస్తున్నారు. పాత నియోజక వర్గాలకు వెళ్లి పనిచేసుకుంటామని ఎక్కువ మంది నేతలు అధినేత జగన్‌కు చెబుతున్నారు. ఆ వైపుగా మార్పులు చేసే యోచనలో ఉన్నారు. బాలినేని జిల్లాకు వచ్చాకగానీ ఆయన కార్యకలాపాలు ఏమిటనేదీ తేలుతుంది.

# కొండ.. పిండి

- చెలరేగిపోతున్న అక్రమార్కులు
- అనుమతులు లేకుండానే గ్రావెల్ తవ్వకాలు
- కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్న వైనం

**ప్రజాశక్తి-గిద్దలూరు**

గిద్దలూరులో అక్రమార్కులు కొండలను పిండి చేస్తున్నారు. కొండలు, తిప్పలు క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే కొండలను, తిప్పలను అక్రమంగా తవ్వి మట్టి మాఫియా యథేచ్ఛగా గ్రావెల్ వ్యాపారం చేస్తోంది. ప్రైవేటు వెంచర్లకు, ఇతర అవసరాలకు కొండమట్టి(గ్రావెల్) అవసరం కాగా ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండానే అక్రమంగా కొండలను తొలిచేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మట్టి మాఫియా పలు ప్రాంతాలలో యథేచ్ఛగా కొండలు తవ్వి మట్టిని అమ్ముకుని యథేచ్ఛగా కోట్ల రూపాయలు గడిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాలలోని కొండలు సగానికి పైగా కనుమరుగయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులు ప్రతిరోజూ ట్రాక్టర్లతో మట్టిని తహశీల్దారు కార్యాలయం మీదుగానే తరలించడం విశేషం. దశాబ్దానికి పైగా అక్రమార్కులు తమ ఏకఛత్రాధిపత్యంతో గిద్దలూరు పరిసర ప్రాంతాలైన దుప్పుల తిప్ప, వెల్లుపల్లి, దద్దవాడ వద్దనున్న కొండ, నరవ వద్ద ఉన్న కొండ, గుమ్ములపల్లి, రాజానగర్ ఇలా అనేక ప్రాంతాలలో వందల ట్రాక్టర్లతో నిత్యం కొండమట్టిని తరలిస్తూ ట్రాక్టర్ మట్టి రూ.1000 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. మట్టి అక్రమార్కుల వలన ఇప్పటికే పలు ప్రాంతాలలో రైతుల పంట పొలాలు, గ్రామాలలోని రోడ్లు నాశనమవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

**చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు**

ఇంత జరుగుతున్నా కూడా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ ఎవరైనా ఫిర్యాదు చేస్తే నామమాత్రంగా ఒకటి లేదా రెండు ట్రాక్టర్లకు పెనాల్టీలు విధించి మరలా విడిచిపెడుతున్నారని అంటున్నారు. కొండలను తవ్వే జేసీబీలను వదిలివేసి పదుల సంఖ్యలలో ఉన్న ట్రాక్టర్లలో కేవలం ఒకటి లేదా రెండు ట్రాక్టర్లకు పెనాల్టీ విధించడమేమిటని పలువురు పెదవి విరుస్తున్నారు. అలాగే ప్రజల నుంచి ఫిర్యాదు వస్తేనే తప్ప గ్రావెల్ అక్రమార్కులపై తాము సొంతంగా చర్యలు తీసుకోకపోవడం హాస్యాస్పదం అని, స్థానిక ప్రజలకు ఉన్న బాధ్యత అధికారులకు లేదా అనే ప్రజలు ఉదయిస్తున్నాయి. అంటే అక్రమార్కులతో అధికారులు ఏమైనా చేతులు కలిపారా అనే విమర్శలు సైతం ప్రజల నుంచి ఉన్నాయి.

**అనుమతులు లేవు: జి సిద్దార్థ, తహశీల్దారు, గిద్దలూరు**

గ్రావెల్ తవ్వకానికి మండలంలో ఎవరికీ ఎటువంటి అనుమతులూ లేవు. గతంలో కూడా అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి వీఆర్‌ఓలతో బృందాలు ఏర్పాటు చేసి అక్రమంగా మట్టి తరలించే వారికి పెనాల్టీలు కూడా విధించాం. ఎక్కడైనా అక్రమంగా కొండలను తవ్వి మట్టి తరలిస్తున్నారని తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

## మహా పాదయాత్ర ప్రారంభం

**ప్రజాశక్తి-మద్దిపాడు:** ఎమ్మెల్యే బిన్ విజయ్‌కుమార్ విజయాన్ని పురస్కరించుకొని యూనిట్ ఇన్‌ఛార్జి దొప్పా శేషయ్య మహా పాదయాత్రను మొదలుపెట్టారు. ఆదివారం ఇనమనమెళ్లూరు గ్రామం నుంచి సింగరకొండ ఆంజనేయ స్వామి దేవస్థానం వరకు ప్రారంభించిన పాదయాత్రను ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ పాదయాత్రలో గ్రామ టిడిపి, జనసేన, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మండవ జయంత్‌బాబు, ఆడక స్వాములు, గ్రామ పార్టీ తెలుగుదేశం అధ్యక్షులు నైనాల భావన్నారాయణ, జనసేన గ్రామ అధ్యక్షులు గుద్దేటి సురేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి దేవభక్తుని ప్రసాదరావు, మండవ గోపీచంద్, మందపల్లి శ్రీనివాసరావు, ఉప్పుగుండూరి వీరాంజనేయులు, బీమవరపు శ్రీనివాసరావు, గంగవరపు జోసఫ్, పాలగేటి ఏలీయా, అంజయ్య, నైనాల మురళీకృష్ణ, బొక్కసం సుబ్బారావు, మాదాసు మహేష్, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి**

తమ గ్రామ పర్యటన నిమిత్తం వచ్చిన ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్‌కు స్థానిక మహిళలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, గుండ్లకమ్మ నుంచి గ్రామానికి నీళ్ల పైపులైను నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో కరెంటు సమస్య తీవ్రంగా ఉందని, గుండ్లకమ్మ నది రెండు వైపులా పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉందని, వంతెన ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## ఉపాధ్యాయుడికి సన్మానం

**ప్రజాశక్తి-కొండపి**

కొండపి మండలంలోని నేతివారిపాలెం హైస్కూల్‌లో ఇంగ్లీషు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న మద్దిరాల మాధవరావును ఎంపిఇవోలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆదివారం నాడు కొండపిలోని జూనియర్ కళాశాలలో మాధవరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిఈవోలు మాట్లాడుతూ మాధవరావు ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం మాధవరావు తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిఈవోలు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కారుమంచి కాలువను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

## కాలువకు మరమ్మతులు చేయండి: రైతుసంఘం

**ప్రజాశక్తి-చీమకుర్తి:** కూలిపోయిన కారుమంచి కాలువ గట్టుకు శాశ్వత మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలని ఏపి రైతుసంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బెజవాడ శ్రీనివాసరావు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి డిమాండ్ చేశారు. కారుమంచి కాలువగట్టు ఆక్రమణలకు గురై మధుకాన్ గ్రానైట్ గనిలో 2021 డిసెంబర్‌లో కూలిన సంగతి పాఠకులకు తెలిసిందే. అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా కట్టకు పట్టలు కట్టి నీళ్ల నడిపినా 130 క్యూసెక్కులు పారుదల కావాల్సి ఉండగా, కేవలం 30 క్యూసెక్కుల నీరే పారు తోంది. రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేదు. ఈ నేపథ్యంలో ఆదివారం ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు కారుమంచి కాలువను సందర్శించారు. రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బెజవాడ శ్రీనివాసరావు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి మాట్లాడారు. నీరందక పొగాకు, మిరప రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలువ గట్టుకు శాశ్వత మరమ్మతులు చేపట్టి, పూర్తిస్థాయిలో నీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కొల్లూరి వెంకటేశ్వర్లు, కొల్లూరి అక్కయ్య, నరసింహా, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి మాయం

(మొదటిపేజీ తరువాయి)

మార్కాపురం ప్రధాన రహదారిలో ఉంది. వేములకోట బస్టాండు అక్కడే. ప్రధాన రహదారికి ఓ వైపు ప్రభుత్వ భూమి కాగా... మరో వైపు జగనన్న కాలనీ ఏర్పడింది. దీంతో ఆ ప్రాంతం నివాస ప్రాంతంగా మారిపోయింది. అక్రమార్కులు అధికారుల అండతో ప్రభుత్వ భూమిపై హక్కులు పొందడం... రిజిస్ట్రేషన్ కూడా జరిగిపోయింది. రెవెన్యూ శాఖలో కొందరు అధికారుల ధన దాహం ఇలాగే కొనసాగితే... ఈ ప్రాంతంలో ఖరీదైన ప్రభుత్వ భూమి ఏదీ మిగలకపోవచ్చునేది నిజం. జిల్లా స్థాయి యంత్రాంగం దృష్టి సారిస్తే తప్ప మార్కాపురం ప్రాంతంలో ప్రభుత్వ భూములు దక్కేలా లేవు. అధికార యంత్రాంగం ప్రభుత్వ భూములను ఎలా కాపాతుందో వేచి చూడాలి మరి.

**IN THE COURT OF I ADDITIONAL JUNIOR CIVIL JUDGE: TIRUPATI**
**O.S. NO. 1721 OF 2006**

BETWEEN
D. Bagavathi ...**Plaintiff**
**AND**
P.Kondaiah(died)& others.
...**Defendants**

**SUIT SUMMONS TO THE DEFENDANT No.11**

D.11) V.Jyothi D/o late Kondaiah, D.No.3-47, Srinagar Colony, Ongole town, Prakasam District.

**Madam,**

Please take Summons that the above Suit has been posted on 23-07-2024 for your appearance. Please attend on that day before the above said Court by 10-30 A.M. either in person or through your Advocate and file your objections if any. Otherwise, the matter will be decided exparte.

**HEARING DATE : 23-07-2024.**

**P.BALARAM,**B.Com.,B.L.,
**M.RAMACHANDRA REDDY,**
ADVOCATES – TIRUPATI
Cell No.9948156064

# భూముల కన్వర్షన్‌లో అవినీతి

**వాటాల్లో తేడా రావడంతో వెలుగులోకి..**

**తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు, ఆర్ఐదే కీలకపాత్ర**

**ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బందికి సైతం ముడుపులు**

**ప్రజాశక్తి-మద్దిపాడు**

రెవెన్యూ శాఖలో చేతులు తడపందే పనులు కావడం లేదు. ల్యాండ్ కన్వర్షన్ విషయంలో విఆర్ఒ రిపోర్టు లేకుండానే, తహశీల్దారు సెలవులో ఉండగా ఆర్ఐ, డిప్యూటీ తహశీల్దారు ఆర్‌డిఒకు ఫైల్ పంపారు. డబ్బుల పంపిణీ విషయంలో తేడా రావడంతో వారి అవినీతి బాగోతం బట్టబయలైంది. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారాయి. అందులో ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బంది కూడా వాటా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు గ్రామంలోని సర్వే నెంబర్ 30/1ఎఫ్‌లోని 7 ఎకరాల 19 సెంట్ల భూమికి కన్వర్షన్ కోసం విఆర్ఒ సంతకం లేకుండా తహశీల్దారు సెలవులో ఉన్న సమయంలో ఆర్ఐ, డిప్యూటీ తహశీల్దారు సంతకాలతో ఆర్‌డిఒ కార్యాలయానికి అప్రూవల్‌కు వెళ్లింది. అప్రూవల్ కోసం సుమారు రూ.3.50 లక్షలు చేతులు మారినట్లు సమాచారం. డిఆర్ఒ కార్యాలయానికి వెళ్లిన ఫైల్‌ను సిసి పరిశీలించి ఆర్‌డిఒకు పంపారు. ఈ క్రమంలో విఆర్ఒ తన సంతకం లేకుండా ఫైల్ అప్రూవల్‌కు ఎలా పంపారంటూ ఆర్ఐను, డిప్యూటీ తహశీల్దార్‌ను నిలదీశారు. దీంతో అసలు బాగోతం బయటపడింది. ఆర్ఐ, డిటి ఇద్దరూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో ఈ విషయం తహశీల్దారుకు తెలిసింది. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో సదరు అధికారులు వివరణ పంపారు. మొదటి ఫైల్‌పై విఆర్ఒ సంతకం లేకపోయినా ఆర్ఐ రిపోర్టుతో డిప్యూటీ తహశీల్దారు చొరవతో ఈ కథ నడిచినట్లు సమాచారం.

రెండో ఫైల్‌కు సంబంధించి సర్వే నెంబర్ 25లో 10 ఎకరాల 13 సెంట్లు ఫైల్‌కు సంతకాలు లేవంటూ ఆర్‌డిఒ తిప్పి పంపారు. అప్పుడు ఈ ఫైల్‌పై విఆర్ఒ, ఆర్ఐ, డిప్యూటీ తహశీల్దారు సంతకాలు చేయడంతో తహశీల్దారు పని సులువు అయింది. తహశీల్దారు వెంచర్ యజమాని వద్ద నుంచి లక్షా 70 వేలు తీసుకుని ఫైల్‌ను అప్రూవల్‌కు పంపినట్లు తెలిసింది. ఈ విషయంపై డిప్యూటీ తహశీల్దార్‌ను వివరణ కోరగా ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. డిటి తమను బెదిరింపులకు గురి చేస్తుందంటూ తహశీల్దారు, విఆర్ఒ శుక్రవారం జెసిని కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన జెసి ఈ వ్యవహారంపై విచారణకు ఎస్‌డిసి సోమవారం పంపుతామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ల్యాండ్ కన్వర్షన్‌లో అవినీతికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మద్దిపాడు తహశీల్దారు కార్యాలయం

## కానిస్టేబుల్ వీరంగం

**రూం ఇవ్వలేదని లాడ్జి మేనేజర్‌తో వాగ్వివాదం**

**ప్రజాశక్తి - మార్కాపురం రూరల్**

లాడ్జిలో తనకు రూం ఇవ్వలేదని ఓ కానిస్టేబుల్ వీరంగం సృష్టించాడు. లాడ్జి మేనేజరుతో వాగ్వాదానికి దిగాడు. ఈ ఘటన మార్కాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం..మార్కాపురం టౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ ఇద్దరు స్నేహితులతో కలిసి స్థానిక కళాశాల రోడ్డు లోని ఓ లాడ్జి వద్దకు వచ్చాడు. మద్యం తాగేందుకు రూం ఇవ్వాలని లాడ్జి మేనేజరును అడిగాడు. రోజు రూ.1000 చెలిస్తే రూం ఇస్తామని మేనేజరు చెప్పాడు. దీంతో ఆగ్రహించిన కానిస్టేబుల్ డబ్బులు అడుగుతావా అంటూ మేనేజరును దుర్భాలాషడాడు. తాను సిఐ దగ్గర పనిచేస్తానని, ఒళ్లు దగ్గర పెట్టుకోని ముసులుకోవాలని, లేకుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. దీంతో మేనేజరు తమ యజమానికి ఫోన్ చేసి జరిగిన విషయం గురించి చెబుతున్నాడు. అగ్రహించిన కానిస్టేబుల్ అతని వద్ద నుంచి ఫోన్ తీసుకుని తాము పోలీసులమని, మేనేజర్ తమను డబ్బులు అడుగుతున్నాడని చెప్పాడు. డబ్బులు ఇవ్వక పోతే రూం ఇవ్వనని చెబుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. లాడ్జి ఎలా నిర్వహిస్తారో చూస్తామంటూ యజమానిని సైతం చరవాణిలో దుర్భాషలాడాడు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి

**ప్రజాశక్తి -కొమరోలు**

విద్యుత్ షాక్‌తో ఓ గేదె మృతి చెందింది. ఈఘటన కొమరోలు పట్టణ సమీపంలోని పొలాలలో ఆదివారం చోటు చేసుకుంది. కొమరోలు రజక బజారుకు చెందిన రమణయ్య తన గేదెను మేత కోసం పొలాల్లోకి తోలుకెళ్లాడు. మేత మేస్తున్న సమయంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై గేదె మృతిచెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు రమణయ్య తెలిపాడు.

# శిథిలావస్థలో నేల చప్టాలు

**కూలిన కల్వర్టు రక్షణ గోడ**

**భారీ వర్షాలకు రోడ్లపైకి నీరు**

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

మండల కేంద్రమైన ఇంకొల్లు నుంచి పలు గ్రామాలకు పోయే మార్గాలలో ఉన్న పాతనేల చప్టాలు దెబ్బతిని శిథిలావస్థకు చేరాయి. వీటితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం ప్రయాణికులలో, వాహనదారులలో నెలకొంది. గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఇంకొల్లు నుంచి నాగులుప్పలపాడు తిమ్మసముద్రం ఆర్అండ్‌బి రహదారిలో మలుపు వద్ద నేల చప్టా రక్షణ గోడ కూలిపోయింది. అదేవిధంగా ఇంకొల్లు మరియు ఒంగోలు పోయే పాత మద్రాసు రోడ్‌లోని దుద్దుకూరు గ్రామ వెలుపల ఉన్న ఉరవాగు చప్టా కూడా దెబ్బతింది. ఈ చప్టాలు చాలా ఏళ్ల క్రితం నిర్మించడంతో శిథిలమయ్యాయి. పలు ప్రాంతంలో కిందగా ఉండటం వలన వర్షాలు కురిసినప్పుడు వాగులు ప్రవహించి నీరు రోడ్డు పైకి మరియు పొలాలపైకి వస్తున్నాయి. దీంతో కొన్ని గ్రామాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. గతంలో వాగు ఉధృతంగా ప్రవహించిన సందర్భాలలో ఇద్దరు వాగులో పడి మరణించిన సందర్భాలు కూడా ఉన్నవి.

ఈ సమస్యలపై గతంలోనూ ఆర్అండ్‌బి దృష్టికి తీసుకుపోయినా అక్కడ కేవలం ప్రమాద సూచిక బోర్డు మాత్రమే అప్పట్లో ఏర్పాటు చేశారు. ఇంకొల్లు నుండి పావులూరు, బోదవాడ మీదుగా పంగులూరు పోయే రోడ్డులో, మల్లవరం గ్రామం వద్ద నీళ్ల చప్టా ఉంది. ప్రస్తుతం టిడిపి అధికారంలోకి వచ్చినందువలన ఈ చప్టాల నిర్వహణ కార్యక్రమాన్ని హైలెవెల్ వంతెనలు ఏర్పాటు చేసి ప్రమాదాలు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పించేందుకు ఇప్పుడైనా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరు కుంటున్నారు. గతంలో ఏలూరి సాంబశివరావు టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ఇంకొల్లు మండలానికి ప్రధాన వాగు సమస్యలైన కొనికి ఊరవాగును హైలెవల్ బ్రిడ్జిగా మరియు గొనసపూడి కడవకుదురు రోడ్‌లోని వాగుపై హై లెవల్ వంతెన, చిన్నగంజాం మండలం పెదగంజాం వద్ద వాగుపై హై లెవల్ వంతెనలు నిర్మించి ప్రజల మన్ననలు పొందాడు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థకు చేరిన చప్టాలు తొలగించి హైలెవల్ చప్టాలు నిర్మించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

కల్వర్టు గోడ కూలడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

చెట్టుకు ఢీ కొన్న బస్సు

## అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న బస్సు

**స్వల్ప గాయాలతో బయట పడిన ప్రయాణికులు**

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

బ్రేక్ ఫెయిల్ అయి అదుపు తప్పి బస్సు చెట్టును ఢీ కొనడంతో స్వల్ప గాయాలతో ప్రయాణికులు బయట పడిన సంఘటన పెద్దదోర్నాల మండలంలోని ఐనముక్కల గ్రామ సమీపంలో గల కొండారెడ్డి కాలనీ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం కర్ణాటకకి చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు భక్తులను తీర్థయాత్రలకు తీసుకెళ్లే క్రమంలో శ్రీశైలం నుంచి తిరుగు ప్రయాణంలో కర్ణాటక వెళ్తోంది. మండలంలోని ఐనముక్కల గ్రామ సమీపంలోని కొండారెడ్డి కాలనీ దగ్గరకు వచ్చే సరికి బస్సుకు బ్రేక్ ఫెయిల్ అయి అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొంది. చెట్టు పక్కనే 11 కేవీ విద్యుత్ సరఫరా స్తంభాన్ని ఢీ కొట్టి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేది. చెట్టును ఢీ కొట్టిన సంఘటనలో కొందరు ప్రయాణికులకు (భక్తులకు) స్వల్ప గాయాలయ్యాయి. వారిని పెద్దదోర్నాలలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించారు. నిత్యం ఆ చెట్టు కింద చాలా మంది కూర్చొని ఉండేవారు. వర్షం కురుస్తుండడంతో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

బోల్తా పడిన కారు

## అదుపు తప్పి కారు బోల్తా

**ప్రజాశక్తి - పంగులూరు**

అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటన ముప్పవరం - పంగులూరు రోడ్డులో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారు కొంత దెబ్బతినగా, ఎవరికి ఎలాంటి గాయాలు లేవు. పంగులూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి గన్నవరపు కోటేశ్వరరావు వారి బంధువులతో పంగులూరు వస్తుండగా పంగులూరు - ముప్పవరం రోడ్డులో ఉన్న సంఘం డైరీ ఎదుటకు రాగానే కారు అదుపు తప్పి, ఎదురుగా ఉన్న స్తంభాన్ని బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. కారులో ఉన్న గన్నవరపు కోటేశ్వరరావుకు ఎలాంటి గాయాలు కాలేదు.

## ముందు వెళ్తున్న లారీని ఢీకొని...

**ప్రజాశక్తి - అద్దంకి**

ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని గోపాలపురం స్పీడ్ బ్రేకర్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. చెన్నై నుంచి తెలంగాణ రాష్ట్రం హుజూర్ నగర్ వెళ్తున్న బొలెరో వాహనం ముందుకు వెళ్తున్న లారీ వేగం తగ్గించడంతో ఢీకొంది. దీంతో బొలెరో డ్రైవర్ అల్లం నాగేంద్రబాబు తీవ్రంగా గాయపడ్డాడు. నవీన్, సాయి స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన నాగేంద్రబాబు

# బ్లాక్‌లో పత్తి విత్తనాల విక్రయం

**- రైతులపై అదనపు భారం**

**- పట్టించుకోని వ్యవసాయాధికారులు**

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

ఇటీవల కురిసిన వర్షాలకు భూములు పదునయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో రైతులంతా విత్తనాలు కోసం ఎగబడుతున్నారు. వ్యాపారులు పత్తి విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో అమ్ముతున్నారు. అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కేశవ, సర్దార్, పిఎం గోల్డ్, శివశక్తి, 555 గోల్డ్ పత్తి విత్తనాల కోసం రైతులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. ఈ విత్తనాలు 475 గ్రాముల ప్యాకెట్ ధర రూ.850 పలుకుతోంది. ప్రస్తుతం వీటి ధర బ్లాక్ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి రూ. వెయ్యి నుంచి రూ.1200 వరకు ధర పలుకుతోంది. గత ఏడాది ఈ విత్తనం వేసిన రైతాంగానికి దిగుబడులు పెరిగాయి. దీంతో రైతులు విత్తనాల షాపుల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదునుగా భావించి వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వర్షాలు కురుస్తాయన్న ఆశతో రైతులు పంట పొలాలు దుక్కులు దున్నారు. విత్తనాలు వేసుకోవటానికి సిద్ధమైన తరుణంలో విత్తనాలు అందుబాటులో లేకపోవటం, వ్యాపారులు కొరత సృష్టించటం పలు విమర్శలకు తావిస్తోంది. విత్తనాలు అమ్మే సమయంలో బిల్లులు, బ్యాచ్ నెంబర్లు కూడా రాయకుండా డూప్లికేట్లు బిల్లులు ఇచ్చి రైతులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**పట్టించుకోని అధికారులు..**

పత్తి విత్తనాలకు కృత్రిమ కొరత కృష్టించి బ్లాక్‌లో అమ్ముతున్నా వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విజిలెన్సు అధికారులు సైతం మొక్కుబడిగా దాడులు నిర్వహిస్తున్నారు. స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు విత్తనాల వ్యాపారులపై కనీసం చర్యలు తీసుకోవటం లేదని రైతుల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పత్తి విత్తనాలు బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

**బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి**

వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాల కోసం ఎగబడుతున్నారు. బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే రైతులు నష్టపోతారు. అధికారులు స్పందించి పత్తి విత్తనాలు బ్లాక్‌లో అమ్మకుండా వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

**దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి**

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

## పింఛను పెంపు హర్షణీయం

**ప్రజాశక్తి - అద్దంకి**

తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే దివ్యాంగులకు రూ.3వేలు నుండి రూ.6వేలకు పెన్షన్ పెంచడం హర్షణీయమని తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు చిన్ని శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పెన్షన్ పెంచిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం ఆదివారం చేశారు.

ఆన్‌లైన్‌పై శిక్షణ ప్రతినిధులు

## ఆన్‌లైన్ విధానంపై శిక్షణ

**ప్రజాశక్తి - పర్చూరు**

రోటరీ క్లబ్ నిర్వహించే కార్యక్రమాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియపై రోటరీ అధ్యక్ష, కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ నిర్వహించినట్లు సహాయ గవర్నర్ తేళ్ల రమేష్ చంద్ర తెలిపారు. స్థానిక నాగుబడి రంగయ్య బధిరుల పాఠశాల్లో పర్చూరు, ఇంకొల్లు, జె పంగులూరు, చీరాల, వేటపాలెం మండలాల అధ్యక్ష, కార్యదర్శులు శిక్షణకు హాజరైనట్లు తెలిపారు. రోటరీ కార్యక్రమాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో ఉంచడం ద్వారా ఉన్నత అధికారులు వెంటనే స్పందించడానికి అవకాశం ఉంటుందని అన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దేవాంగ ప్రతినిధులు

## విద్యార్థులకు ఆర్థిక సహాయం

**ప్రజాశక్తి - వేటపాలెం**

మండలంలోని దేశాయిపేట పంచాయితీ సాయినగర్లో నివాసం ఉంటున్న పేద దేవాంగ చేనేత కార్మికుడైన పసుమర్తి మధుమోహనరావుకు రూ.20వేల ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. గత కొంత కాలం నుంచి పక్షవాతంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇద్దరు ఆడపిల్లలు రాధిక, నాగవేణి ఇంజనీరింగ్ చదువుల నిమిత్తం ఆర్థిక సహాయం, వైద్య సహాయం దేశాయిపేట మాజీ సర్పంచ్ నాసిక వీరభద్రయ్య సూచన మేరకు కుటుంబ సభ్యులకు దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు నగదు రూపంలో సహాయం చేశారు. చేనేత విద్యార్థులను ఆదుకోవాల్సిన బాధ్యత చేనేత ప్రతినిధులపై ఉందని అన్నారు. చేనేత కార్మికులకు ఆరోగ్య భీమా వర్తింపజేయాలని కోరారు. ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు ఐక్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కుర్మా రాహుల్జి, బండ్ల బాబు, యారాసు అరుణ్ బాబు, చింతా రాము, భూషణ్ శ్రీనివాసరావు, పృద్వి ఆదిశేషు, నాసిక శివాజీ, పింజల శ్రీనివాసరావు, దేవన విజయలక్ష్మి, భూసం వెంకటసుబ్బయ్య, లేళ్ల చంద్రశేఖర్, గుపర్తి మోహన్ పాల్గొన్నారు.

# చేనేతల సమస్యలు పరిష్కరిస్తా

**ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య**

**ప్రజాశక్తి - చీరాల**

మండలంలోని దేవాంగపురి దేవాంగ కళ్యాణ మండపం నందు హ్యాండ్లూమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్యను ఆదివారం ఘనంగా సత్కరించారు. మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. ఈపురుపాలెం నుండి పందిళ్లపల్లి వరకు మాస్టర్ వీవర్స్ వద్ద రూ.50కోట్లకుపైగా విలువైన చేనేత వస్త్ర నిల్వలు ఉన్నాయని తెలిపారు. వాటిని ఆప్కో ద్వారా కొనుగోలు చేయించి చేనేత కార్మికులకు ఉపాధి చూపించాలని కోరారు. నిల్వలు పేరుకుపోయి కార్మికులకు పని కల్పించలేకపోవటం వలన చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణం నిల్వ ఉన్న చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కొండయ్య మాట్లాడుతూ చేనేత కార్మికుల ఉపాధి, చేనేత వృత్తి మనుగడ, కార్మికుల సంక్షేమానికి శ్రద్ధ తీసుకుంటానని చెప్పారు. చేనేత జౌళి శాఖ మంత్రి దృష్టికి చేనేతల సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతానని ఆహామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సిద్ది బుచ్చేశ్వరరావు, గుత్తి ఆంజనేయులు, బట్ట శ్రీను, గుత్తి వెంకయ్య, బట్ట సురేష్, పసుమర్తి మల్లికార్జున, బుద్దె భాస్కర్, వడగా రాజా, సజ్జా లేనిన్, బట్ట రాంబాబు, బాల సుబ్రహ్మణ్యం, వి ప్రసాద్, హరికృష్ణ, పసుమర్తి శ్రీను, వెంగళ భరత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న చేనేత ప్రతినిధులు

# సముద్ర తీరంలో పర్యాటకుల సందడి

**ప్రజాశక్తి - చీరాల**

వాడరేవు, రామాపురం సముద్రతీర ప్రాంతాల్లో అధికారులు బీచ్ ఓపెన్ చేయడం, ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులతో సముద్రతీరంలో సందడి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. పోలీసులు గస్తీ నిర్వహించారు. పర్యాటకులను తీరంలో ఎక్కువ దూరం వెళ్లకుండా కట్టడి చేశారు. ఇటీవల పలువురు యువకులు సముద్ర తీరంలో మృతి చెందిన సంగతి అందరికీ తెలిసిందే. దీంతో కొద్దిరోజులుగా బీచ్‌ను అధికారులు మూసివేశారు. గత 20రోజులుగా సముద్ర తీరం బోసిపోయింది. తాజాగా బీచ్‌కు అనుమతి ఇవ్వడంతో పెద్ద ఎత్తున పర్యాటకులు వర్షం సైతం లెక్కచేయకుండా వచ్చారు. ఈపురుపాలెం ఎస్ఐ శివకుమార్, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు పర్యాటకులకు ప్రమాదం జరగకుండా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పర్యాటకులు అందరూ పోలీసులకు సహకరించి నిర్ణయించిన ప్రాంతాల్లోనే సముద్ర స్నానాలు చేయాలని, ప్రమాదకర ప్రాంతాల్లో మునగ వద్దని సూచించారు.

పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివకుమార్

# హేతుబద్ధ ఆలోచనలతో మెరుగైన జీవనం

**ప్రజాశక్తి - బాపట్ల**

మానవ జీవన విధానం మెరుగు పడాలంటే హేతుబద్ధ ఆలోచ అత్యవసరమని తెలంగాణ హేతువాద సంఘ ఉపాధ్యక్షులు షేక్ నబీసాహెబ్ అన్నారు. స్థానిక ఎన్జీఒ హెూంలో రెండు రోజులపాటు జరిగిన భారత హేతువాద సంఘ 93వ వార్షిక మహాసభలు, ఆంధ్రప్రదేశ్ హేతు వాద సంఘ 23వ ద్వైవార్షిక మహాసభల సందర్భంగా రెండవరోజు హేతువాదం, మానవవాద అధ్యయన తరగతులు ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా హేతువాద సంఘ అధ్యక్షులు కెవి సత్య నారాయణ, భారత హేతువాద సంఘ అధ్యక్షులు గుమ్మా వీరన్న మాట్లాడారు. ఈ సందర్భంగా మేడూరు రచించిన మానవుడు జీవన విధానం గ్రంథాన్ని ఆవిష్కరించారు. సభలో షేక్ బాబు, పూరా హనుమంతరావు, ఆలూరి ప్రఫుల్ల చంద్ర, బాబు పల్లిక్కర్, శరణం రవీంద్రబాబు, కె శ్రీనివాసచారి, కెవివి సత్యనారాయణ, చెంచు శేషయ్య, వేణు తొనకల్, షేక్ దరియావలి, కాకి రాజశేఖర్, పల్లపోలు రామ్ మనోహర్ లోహియా పాల్గొన్నారు.

మానవ జీవన విధానం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

# చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలి

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

దశాబ్ద కాలంగా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వాలు కాలయాపన చేయటం వల్ల సంఘాలు దెబ్బతింటున్నాయని, తక్షణమే ప్రభుత్వం ఎన్నికల నిర్వహించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం నెల్లూరులో జరిగిన రాష్ట్ర చేనేత కార్మిక సదస్సులో వివిధ అంశాలపై చర్చించినట్లు తెలిపారు. జౌళి శాఖ నుండి చేనేతను విడదీసి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. చేనేత వస్త్రాలపై 11రకాల రిజర్వేషన్లను అమలు చేసి నిల్వవలు లేకుండా చూడాలని కోరారు. దీని ద్వారా సొసైటీల బలోపేతానికి చర్యలు చేపట్టాలని అన్నారు. చేనేతకు రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించి చేనేత బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అర్హులైన చేనేత కార్మికులకు ఉచితంగా మూడు శెంట్ల స్థలం కేటాయించి వర్క్‌షెడ్డుతో కూడిన ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, చేనేత కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నైపుణ్యా రాయితీ రూ.2వేల నుండి రూ.3వేలకు పెంచాలని కోరారు. నేతన్న నేస్తం రూ.36వేలు ఇవ్వాలని కోరారు. చేనేత ఉత్పత్తుల నిల్వలను ప్రభుత్వమే కొను గోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు రామకోటేశ్వరరావు, జి లక్ష్మి, కె వీర మోహనరావు, బండారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐటియుసి నాయకుడు జి బాలాజీ

గంగవరం మెడికల్ క్యాంపులో నాయకులు

## 140మందికి పరీక్షలు

**ప్రజాశక్తి - పంగులూరు**

షుగరు, బీపీ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అదుపులో పెట్టవచ్చని విశ్రాంత హెచ్ఎం కర్రి కమలేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు కందిమల్ల రామ కోటేశ్వరావు అన్నారు. గంగవరంలోని మంచాల వెంకటరామయ్య, రంగమ్మ కళ్యాణ వేదికలో గంగవరం ఆరోగ్య, సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఉచిత రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. కర్రి రామయ్య (బాపమ్మ) జ్ఞాపకార్థం ఆయన భార్య కర్రి విజయలక్ష్మి, కుమారుడు వాసుబాబు, కోడలు విష్ణు ప్రియ, కుమార్తె కల్పన, కుటుంబ సభ్యుల సహకారంతో వైద్యశిభిరం నిర్వహించారు. డాక్టర్ ఎ సాంబయ్య రోగులను పరీక్షించి మందులను రాశారు. కె బాలచందర్, తలపనేని రామారావు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట సుబ్బారావు, రఘుచంద్, సృజన, జ్యోతి, ఎవి సుబ్బారావు, బోడెంపూడి సూరిబాబు, బత్తుల హనుమంతరావు, కరి జగన్నాథం, తన్నీరు గోవిందరాజులు పాల్గొన్నారు.

**రేపల్లె :** భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి, పిట్టలవానిపాలెం కేర్ ఆయుర్వేద హెూమియోపతి ఫిజియోథెరపీ హాస్పిటల్ సంయుక్తంగా ఆదివారం పట్టణంలోని సత్యసాయి సేవా సమితి నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మోకాళ్ల నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలకు వైద్యులు ఉచిత వైద్యం చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారని క్యాంపు కోఆర్డినేటర్ నాగేశ్వరరావు తెలిపారు. 125మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. డాక్టర్ సూర్యవంశీ, బ్రాహ్మణి, సమీర్, సత్య, సౌమ్య వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ బాబు

## రాష్ట్రంలో టిడిపి అరాచక పాలన

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారం చేపట్టిన నాటి నుండి టిడిపి అరాచక పాలన కొనసాగిస్తుందని వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు ఆరోపించారు. వైసిపి నాయకులు బండారు శ్రీనివాసరావు నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ కేసులు బనాయిస్తూ భౌతిక దాడులకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దాడులు చేయడానికి ఉపయోగిస్తున్నారని అన్నారు. అద్దేపల్లిలో విగ్రహాన్ని పెట్రోల్ పోసి దగ్ధం చేసిన ఘటనలో 24గంటల్లోనే విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. వైసిపి కార్యకర్తలు భయపడాల్సిన పనిలేదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డివి లలిత కుమారి, వైసీపీ పట్టణ కార్యదర్శి కుందేటి రమేష్, టి బాలాజీ, సిరాజుద్దీన్, కుక్కల బుషణరావు, నాగమల్లేశ్వరరావు, చిన్నారి, వేల్పూర్ నాగేశ్వరరావు, పడమటి శ్రీనివాసరావు, కౌతర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మొక్కలు పెంపకంతో ఆరోగ్యవంతమైన వాతావరణం

**ప్రజాశక్తి - చీరాల**

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ, మంచి ఆరోగ్యంతో పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయని సెయింట్ ఆంథోని చర్చి ఫాదర్ కె జగన్ అన్నారు. మరియమ్మపేటలోని స్థానిక పునీత ఆంతోని ఆర్‌సిఎం చర్చి ఆవరణంలో ఫాదర్ నరేష్ ప్రార్థన మందిర క్రైస్తవులతో కలసి మొక్కలు నాటారు.

జిఓ ప్రతులను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

## 'జిపిఎస్'ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-పొదిలి

జిపిఎస్ అమలు ఉత్తర్వులను ఉపసంహరించు కోవాలని కోరుతూ యుటిఎఫ్ నాయకులు ఆదివారం నిరసన తెలుపారు. స్థానిక జూనియర్ కళాశాల రోడ్డులోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం వద్ద జిపిఎస్ అమలుకు గెజిట్ విడుదలకు నిరసనగా పొదిలి యుటిఎఫ్ డివిజన్ ఆధ్వర్యంలో పొదిలి డివిజన్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పిల్లి రమణారెడ్డి జిల్లా సహాధ్యక్షులు అబ్దుల్ హై, యూటీఎఫ్ జిల్లా ఆడిట్ సభ్యులు బోదాల బుజ్జిబాబు, పొదిలి మండల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, కొనకన మిట్ల ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, మర్రిపూడి ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో జిపిఎస్ గెజిట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ కార్యకర్తలు బాలకాశి రెడ్డి, సింగంపల్లి సుబ్బా రావు, శ్రీనివాస్ రెడ్డి, దేవప్రసాద్, గురవయ్య, పోలు శ్రీనివాసరెడ్డి, జూపల్లి వెంకటేశ్వర్లు, బీమ్ పాటి శ్రీనివాస్ రెడ్డి, ఎస్.కె ఖాసిం, మేడం శివారెడ్డి, కాట్రగడ్డ సుబ్బా రావు, రమేష్ రెడ్డి, గంట ఆంజనేయులు పాల్గొన్నారు.

# లక్ష్యంతో భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

- ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్
- విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌పి

విద్యార్థులు ఇష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని బదిలీపై వెళుతున్న ఎస్పి గరుడ్ సుమిత్ సునీల్ పేర్కొన్నారు. ఒంగోలులో పోలీస్ కళ్యాణ మండపంలో ఆదివారం చదువుల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన 127 మంది విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. ప్రకాశం జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న అన్ని విభాగాల కుటుంబాలలో (పోలీస్, హోమ్ గార్డ్, డిపిఒ అవుట్ సోర్సింగ్) ఒకటో తరగతి నుండి పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, క్రీడా విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన 127 మంది విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులను వారి తల్లిదండ్రుల సమక్షంలో ఎస్‌పి అందజేశారు. ఈ సందర్భంగా గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ పోలీసు కుటుంబాలకు చెందిన ఎక్కువ మంది ఉత్తమ ఫలితాలు సాధించటం చాలా సంతోషంగా వుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని మంచి మార్కులు సాధించారని, భవిష్యత్తులో బాగా చదువుకొని ఉన్నత స్థాయిలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు వారి చదువుల్లో క్రమ శిక్షణ, విశ్లేషణను అలవరచుకోవాలని విద్యార్థులు వారి కిష్టమైన రంగాల్లో నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలన్నారు. చక్కని ప్రణాళికలు రూపొందించుకొని బంగారు భవిష్యత్తు వైపు బాటలు వేసుకోవాలని, ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని దానిని గుర్తించినట్లయితే ఏదైనా సాధించగలరన్నారు. పోలీసు విధులు కష్టంతో కూడుకున్నవని, కుటుంబంతో గడపడానికి తక్కువ సమయం ఉన్నప్పటికీ వారి పిల్లల చదువుల కోసం మంచి గైడెన్స్ ఇస్తూ అన్ని వసతులు సమకూరుస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. కావున పిల్లలు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, జిల్లాకే కాక, దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తొలుత ఒంగోలుకి చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణులు వెల్ విషర్ శంకర్ విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, ఆనందం, వ్యక్తిత్వ వికాసం, బాడీ లాంగ్వేజ్, మాట్లాడే తీరు, లక్ష్యం, ఏకాగ్రత వంటి విషయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అదనపు ఎస్పీ అశోక్ బాబు, ఏఒ ఎం.సులోచన, ఎస్‌బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, డిసిఆర్‌బి సిఐ భీమా నాయక్, పిసిఆర్ సిఐ వెంకటేశ్వరరావు, ఆర్ఐలు సీతారామి రెడ్డి, రమేష్ కృష్ణ, రమణ రెడ్డి, డిపిఒ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ శరత్

## పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలి

జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ శరత్

ప్రజాశక్తి-మార్కాపురం

పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలని జెవివి జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ బి.శరత్ సూచించారు. 'జన విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో స్థానిక రెడ్డి మహిళా జూనియర్ కళాశాలలో ఆదివారం "పర్యావరణంపై రంగులు-ప్లాస్టిక్ ప్రభావం" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ శరత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పర్యావరణ కాలుష్యం పెరిగిపోవడంతో జరిగే అనర్ధాలను వివరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న పర్యావరణ కాలుష్యంతో నమోదవుతున్న అత్యధిక ఉష్ణోగ్రతలతో ప్రపంచ దేశాలన్నీ అతలాకుతలం అవుతున్నాయన్నారు. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల సకాలంలో వర్షాలు కురవక పోవడంతో కరువు విలయతాండవం చేస్తోందన్నారు. ఉష్ణోగ్రతలు తగ్గేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని పెంచి పోషించాలన్నారు. కావున వాయు, జల, భూగర్భ కాలుష్యం కాకుండా ప్రకృతిని, భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రెడ్డి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రావి గాయత్రి, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు సయ్యద్ రఫీ, ఉదయగిరి వెంకట్రావు, మండల నాయకులు ఆర్ విప్లవకుమార్, ఏనుగుల శివ, దూదేకుల రసూల్, మండ్ల శ్రీనివాసులు, వడ్డే రవికాంత్, కంభం సిఎల్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గుండాల ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శివం ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

- ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్
- ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నిత్యం 300 మందికి అన్నం పెట్టి కడుపు నింపుతున్న శివం ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయని, నిర్వాహకులు గొల్లపూడి శ్రీహరి అభినందనీయుడని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ తెలిపారు. స్థానిక సంతపేటలోని శివం నిత్య అన్నదాన క్షేత్రం ప్రారంభించి మూడేళ్ళు అయిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కేక్ కట్ చేసి అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా శివం శరణాలయంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివం శరణాలయంలోని వృద్ధులకు ఆశ్రయం కల్పించి మూడు పూటలా భోజనం పెట్టి వాళ్ల బాగోగులు చూస్తున్నారన్నారు. ఒంగోలు నగరంలో శివం నిత్య అన్నదాన వాహనం ద్వారా అనాథలు, యాచకులు, పేదలకు ప్రతిరోజు 300 మందికి అన్నం పెట్టి కడుపు నింపడం మానవత్వంతో కూడిన గొప్ప సేవా కార్యక్రమమన్నారు, ఈ శివం శరణాలయానికి ప్రభుత్వం తరపున సొంత స్థలం ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ శివం ఫౌండేషన్ ద్వారా పేదలకు అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న ఈ శరణాలయానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఒంగోలు నగర అభివృద్ది కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ధనవంతులు దాతృత్వంతో మీ కుటుంబాలలో పుట్టినరోజులు పెళ్లిరోజులు ముఖ్యమైన రోజుల్లో శివ శరణాలయంలో జరుపుకుని పేదలకు ఆర్థికంగా అండగా ఉండాలని తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ తెలుగు మహిళ కార్యదర్శి మండవ లావణ్య మాట్లాడుతూ అన్ని దానాలలో అన్నదానం మిన్న అని, రెండు సంవత్సరాలకు పైగా ప్రతిరోజు క్రమం తప్పకుండా పేదలకు అన్నం పెట్టి కడుపు నింపుడం గొప్ప సేవా కార్యక్రమాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావును శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, మండవ సుబ్బారావు, కోసూరి శ్రీదేవి, వడ్డెంపూడి సుజాత, చిక్కాల కిరణ్ కుమార్, డి శ్రీనివాస్, భాస్కర్ రావు, జెమినీ శ్రీనివాస్ దివ్య పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

వృథాగా పోతున్న సాగర్ నీరు

## సాగర్ నీటి సరఫరా పైపు లీకేజీ

వృథాగా పోతున్న నీరు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని చైతన్య నగర్‌లోని మసీదు లైన్ వీధిలో సాగర్ నీరు అందించేందుకు వేసిన పైపులైన్ (ఇనుప పైపులు) శిథిలమై, పెద్ద రంధ్రాలు పడి సరఫరా వదిలిన ప్రతి రోజూ నీరంతా వృథాగా పోతోంది. ఆ వీధి వారు పైపు రంధ్రాలకు గట్టిగా కట్టినా నిలబడడం లేదు. సాగర్ నీరంతా వృథాగా పోతూ రాళ్లవాగులో కలుస్తోంది. విషయాన్ని ఆ వీధి వారంతా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అసలే యర్రగొండపాలెంకు సాగర్ నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన దూపాడు చెరువు (సమ్మర్ స్టోరేజ్) ట్యాంకులో నీటి మట్టం తగ్గిపోయింది. కేవలం 200 ఎంఎల్ నీటి మట్టం మాత్రమే ఉంది. ఆ నీటిని జాగ్రత్తగా, పొదుపుగా వాడినట్లయితే యర్రగొండపాలెం పంచాయతీకి పది రోజులు పాటు సాగర్ నీరు అందే అవకాశం ఉంది. ఆ తర్వాత తిరిగి సాగర్ కాలువలకు నీటిని సరఫరా చేసి వాటిని చెరువులకు నింపి స్టోరేజి చేసుకునేంత వరకు యర్రగొండపాలెం పంచాయతీకి నీటి కష్టాలు తప్పవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగర్ పైపుకు మరమ్మతులు చేయించి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

# ప్లాస్టిక్ సర్జరీ చికిత్సపై అవగాహన పెంపొందించుకోవాలి

ప్లాస్టిక్ సర్జరీవైద్యులు ఎందేటి సునీల్ కిషోర్

నేడు ప్లాస్టిక్ సర్జరీ డే

ప్రజాశక్తి-ఒంగోలు

ప్లాస్టిక్ సర్జరీ చికిత్స పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఉషా ప్లాస్టిక్ సర్జరీ క్లినిక్ వైద్యులు డాక్టర్ ఎందేటి సునీల్ కిషోర్ తెలిపారు. సోమవారం వరల్డ్ ప్లాస్టిక్ సర్జరీడేను పురస్కరించుకొని ఒంగోలు అంజయ్య రోడ్డు లోని ఉషా ప్లాస్టిక్ సర్జరీ క్లినిక్ ఆవరణంలో డాక్టర్ సునీల్ కిషోర్ ప్లాస్టిక్ సర్జరీ చికిత్స గురించి పలు విషయాలు ఆదివారం వివరించారు. ప్లాస్టిక్ సర్జరీ భారతదేశంలో పుట్టిందన్నారు. దీనికి పురాతనమైన చరిత్ర ఉందన్నారు. భారతదేశం నుంచే ప్రపంచం మంతా ప్లాస్టిక్ సర్జరీ వైద్యం నేర్చుకుందన్నారు. అయినప్పటికీ నేటికీ ప్రజల్లో ప్లాస్టిక్ సర్జరీ వైద్యం పట్ల సరైన అవగాహన లేదన్నారు. దీనివల్లే అనేక మంది అంగవైకల్యంతో, కళావిహీనంతో జీవనం సాగిస్తున్నారన్నారు. ప్లాస్టిక్ సర్జరీ పై చాలామందికి అపోహలు ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ సర్జరీ అనేది శరీర పునర్నిర్మాణ శస్త్ర చికిత్స అని తెలిపారు. సాధారణంగా కణజాలం యొక్క భాగాన్ని పునర్నిర్మాణ ప్రదేశానికి బదిలీ చేయడం, రక్తనాళాలను తిరిగి కనెక్ట్ చేయడం ద్వారా తప్పిపోయిన కణజాలాల నిర్మాణానికి సంబంధించి మైక్రో సర్జరీ ద్వారా శస్త్ర చికిత్స చేస్తారన్నారు. రొమ్ము పునర్నిర్మాణం తల, మెడ నిర్మాణం, చేతి శస్త్ర చికిత్స బ్రెకెన్ ప్లెక్సస్ సర్జరీ వంటివి వీటిలో ముఖ్యమైన ప్రాంతాలు అన్నారు. కాస్మోటిక్ ప్లాస్టిక్ సర్జరీ అవాంఛనీయమైన రోమాలు తొలగించడానికి, మగవారిలో ఉదర భాగం తగ్గించడానికి, ఆడవారి బ్రెస్ట్ సైజులను తగ్గించడానికి, పెంచడానికి, ముక్కు అందాన్ని పెంచు కోవడానికి, కాలిన శరీర భాగాలను యథాస్థితికి తెచ్చుకోవడానికి, కలర్ ఇంప్రూవ్మెంట్‌కు చికిత్స అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులలో కాలి భాగంలో వచ్చే పలు వ్యాధులను ప్లాస్టిక్ సర్జరీ ద్వారా నయం చేయవచ్చునని పేర్కొన్నారు. విద్యుత్ షాక్‌తో చేతి నరాలు, కండలు పూర్తిగా కోల్పోయిన పేషెంట్‌ను చూపించి అతనికి జరిగిన శస్త్ర చికిత్స గురించి వివరించారు. ప్లాస్టిక్ సర్జరీపై అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరల్డ్ ప్లాస్టిక్ సర్జరీడే ని పురస్కరించుకొని వారం రోజులు పాటు ఉషా ప్లాస్టిక్ సర్జరీ క్లినిక్‌లో ఉచిత ఓపితో పాటు పలు శస్త్ర చికిత్సలు రాయితీపై అందిస్తున్నట్లు డాక్టర్ సునీల్ కిషోర్ తెలిపారు. వరల్డ్ ప్లాస్టిక్ సర్జరీ డే సందర్భంగా ఉషా ప్లాస్టిక్ సర్జరీ క్లినిక్‌లో కొత్తగా కాస్మోటిక్ విభాగం ప్రారంభించినట్లు తెలిపారు. (వెల్వెట్ ఎస్తేటిక్స్) కాస్మోటిక్ విభాగం ద్వారా కార్బన్‌పీల్ లేజర్ ఫేషియల్స్, సిఒటు ఫ్రాక్షనల్ లేజర్, క్రైయోలిపోలైసిస, మెడి ఫేషియల్స్, కెమికల్ పీల్స్, హైడ్రా ఫేషియల్ లాంటి సేవలు అత్యాధునికమైన పరికరాలతో అందించనున్నట్లు తెలిపారు. ప్రజల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9293949335, 9059949335 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్లాస్టిక్ సర్జరీవైద్యులు సునీల్ కిషోర్

కాస్మోటిక్ విభాగాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సునీల్ కిషోర్

# పారిశుధ్య పనులు వేగవంతం

## - మరమ్మతు పనులను పరిశీలించిన మంత్రి స్వామి

**ప్రజాశక్తి-కొండపి**

కొండపిలో పారిశుధ్య పనులు వేగం పుంజుకున్నాయి. గత వైసిపి ప్రభుత్వంలో కొండపిలో రోడ్డు మీద వర్షపు నీరు తొలగించలేకపోయారు. ఎంతోమంది బాటసారులు, ద్విచక్ర వాహనదారులు, దుకాణాదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు కాని, నాయకులు కాని కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. టిడిపి అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలలోనే కొండపిలో ఎప్పటి నుంచో పరిష్కారం కాని పారిశుధ్య పనులపై దృష్టి సారించారు. ఇటీవల కురుస్తున్న తేలికపాటి వర్షాలకు పోలీసు స్టేషన్ ముందు ఆర్అండ్‌బి రోడ్డుపై వర్షపు నీరు నిలిచి చిన్నపాటి చెరువును తలపించింది. దీంతో గ్రామస్తు లకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు సైతం రావడానికి

సైడు కాలువల మరమ్మతు పనులు పరిశీలిస్తున్న మంత్రి స్వామి

వీలులేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం నియోజకవర్గంలోని కొండపికి వచ్చిన రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి రోడ్డులో నిలిచిన వర్షపు నీటిని పరిశీలించి తక్షణమే నీరు పోయే చర్యలు తీసుకోవాలని అదికారులకు సూచించారు. గతంలో ఆయా రోడ్డు పక్కన డ్రైనేజీ కాలువలు నిర్మించి ఉండటాన్ని ఆయన వారికి గుర్తుచేశారు. తక్షణమే అక్రమణదారులు వేసిన మట్టిని తొలగించి గతంలో ఉన్న డ్రైనేజీ కాలువను పునరుద్ధరించాలని అధికారులకు పురమాయించారు. మంత్రి ఆదేశాలు అందుకున్న అధికారులు ఆదివారం డ్రైనేజీ కాలువ పనులు మొదలుపెట్టారు. జెసిబి సహాయంతో డ్రైనేజీపై ఉన్న మట్టిని తొలగించి ట్రాక్టర్ల సహాయంతో బయటకు తరలించారు. ఆయా పనులను మంత్రి ఆదివారం స్వయంగా పరిశీలించారు. ఆయన వెంట ఆర్అండ్‌బి డిఈ మాధవరావు, అధికారులు, స్థానిక నాయకులు ఉన్నారు.

టంగుటూరు గ్రంథాలయంలో చదువుకుంటున్న చిన్నారులు

## 'చదవడం నాకెంతో ఇష్టం'

**ప్రజాశక్తి-టంగుటూరు**

టంగుటూరు శాఖా గ్రంథాలయంలో 'చదవడం నాకెంతో ఇష్టం' ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలందరూ గ్రంథాలయంలో చదువుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథపాలకులు గుమ్మడి వర్ధనరాజు మాట్లాడుతూ గ్రంథాలయం విజ్ఞాన గని అన్నారు. మంచి కథలు చదివి జ్ఞానం పొందేందుకు, పోటీ పరీక్షలలో విజేతలు అయ్యేందుకు, మంచి భవిష్యత్‌కు పునాదులు వేసుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రామస్థులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించే అలవాటు చేయాలని గ్రంథపాలకుడు వర్ధనరాజు కోరారు.

మొక్కలు నాటుతున్న దృశ్యం

## పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

పచ్చదనం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మండలంలోని ఉప్పుగుండూరులో కనగాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని కనగాల కమలనాథం మొక్క నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పచ్చనిచెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని అయ్యప్ప స్వామి గుడి వద్ద నుంచి ఒంగోలు పోయే బైపాస్ రోడ్డు వరకు మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో ప్రాణాంతకమైన కోనోకార్పస్ చెట్లు ఉండేవని, తద్వారా ప్రజలు ఆ చెట్లనీడన ఉంటే అనారోగ్యం పాలవుతున్నారని తెలియడంతో వాటిని తొలగించి ఆ స్థానంలో బాటసారులకు నీడనిచ్చే చెట్లతోపాటు అందమైన 150 పండ్ల మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సామాజిక సేవా కార్యకర్త టి శామ్యూల్ మాట్లాడుతూ మొక్కలు నాటటం మంచి పరిణామన్నారు. ప్రతిఒక్కరూ. ఇంటింటి చెట్లు పెంచితే ఊరంతా పచ్చని వనంలా మారి శోభాయమానంగా ఉంటుందని తెలిపారు. మేము సైతం అంటూ ఉన్నం వెంకటరావు, మొబైల్ షాపు శివ, తూబాటి శ్రీకాంత్, నల్లూరి మోహనరావు, గుడివాడ బ్రహ్మయ్య, కండ్లగుంట సాయి, గోగినేని హరిబాబు, కొప్పర్తి శ్రీనివాస్ తదితరులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కల్తీని నిర్ధారించిన అధికారులు

### పెట్రోల్ బంకులో విక్రయాలు నిలిపివేత

**ప్రజాశక్తి-కొనకనమిట్ల**

ప్రజాశక్తి
కథనానికి స్పందన

కొనకనమిట్ల హెచ్‌పి పెట్రోల్ బంకులో కల్తీ పెట్రోలు విక్రయాలు జరుగు తున్నాయని ప్రజాశక్తి దిన పత్రికలో ఆదివారం కథనం ప్రచురితం కావడంతో అధికా రులు స్పందించారు. తహ శీల్దారు ఎస్‌కె షాజిదా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీ రామనారాయణ, లీగల్ మెట్రాలజీ సిబ్బంది ఆదివారం పెట్రోల్ బంకును సందర్శించారు. పెట్రోల్, డీజిల్‌ను నిశితంగా పరిశీలించారు. శాంపిల్‌ను సేకరించారు. కల్తీ నిర్ధారణ కావడంతో బంకులో విక్రయాలు జరగకుండా సీజ్ చేశారు.

## 300 మందికి వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి-కొండపి**

కొండపిలోని పొదిలి రోడ్డులో పోలీసు స్టేషన్ ఎదురుగాఉన్న అమూల్య క్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ఒంగోలు ఆదర్శ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె ఆదర్శ్ పాల్గొని 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సందర్భంగా డాక్టర్ కె ఆదర్శ్ మాట్లాడుతూ తినే ఆహారంలో మార్పులు చేసుకోవాలని సూచించారు. కొండపి పరిసర ప్రాంతాలలో ఉండేవారికి బిపి, షుగరు వ్యాధులు కనపడుతున్నాయని, బిపి, షుగరు పరీక్షలు చేయించుకొని రోగ నిర్ధారణ చేయించుకోవడం ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అమూల్య, ఆర్ఎంపి రవి, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన రోగులు పాల్గొన్నారు.

## పథకాల అమలు ఎప్పుడు?

### దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

**ప్రజాశక్తి-దర్శి**

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా, ప్రతి ఒక్కరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ఆర్భాటంగా, అట్టహాసంగా ప్రచారం చేసిన టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక, పథకం అమలులో మరోసారి దగా చేస్తోందని ప్రకాశం జిల్లా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై ఆయన జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పిల్లలు, తల్లులను పచ్చిగా మోసం చేస్తోందని, అది తల్లికి వందనం కాదని పిల్లలు, తల్లులకు పంగనామం అన్నట్లుగా వ్యవహరిస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలందరినీ వంచనకు గురి చేస్తోందని అన్నారు. తల్లికి వందనం అమలుపై ఇటీవల జీవో 29 జారీ చేసిన ప్రభుత్వం, అందులో ప్రతి పిల్లాడికి అని కాకుండా, ప్రతి తల్లికీ రూ.15 వేలు ఇస్తామంటూ ప్రకటించడం కూటమి ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా నమ్మించి మోసం చేస్తుందో అర్ధమవుతోందన్నారు. మేనిఫెస్టోకు కట్టుబడి ఉండకపోవడం, ఇచ్చిన మాట తప్పడం, పథకాలు అమలు చేయకపోవడం, ప్రశ్నిస్తే దబాయించడం, ఎదురు దాడి చేయడం టీడీపీకి ఆనవాయితే అని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం పథకం అమలు విషయంలో కూడా అదే ధోరణి చూపుతోందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, పథకంలో అర్హులైన కొత్త పిల్లలను చేర్చి, పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ డిమాండు చేశారు. చంద్రబాబు అంటేనే నయ వంచనకు మారుపేరని మరోసారి రుజువైందని ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి అన్నారు. బాబు తీరు ఎప్పటికీ మారదన్నది అందరికీ అర్థమైందన్నారు.

**జగన్‌పై అక్రమ కేసు..**

సాక్షాత్తూ సుప్రీంకోర్టు తప్పుపట్టినా, అప్పటి ఎంపీ రఘురామ ఫిర్యాదులో వాస్తవం లేదని తేల్చి చెప్పినా, ఆ కేసు అప్పుడే కొట్టివేసినా.. మళ్లీ ఈ ప్రభుత్వం నిస్సిగ్గుగా, మూడేళ్ల తర్వాత సీనియర్ ఐపీఎస్‌లతో పాటు, జగన్ పైనా, డాక్టర్‌పైనా కేసు నమోదు చేసిందన్నారు. ఎవరి సంతోషం కోసమో ఎవరిని ఇబ్బంది పెట్టడం కోసమో అన్నట్లుగా మూడేళ్ల తర్వాత కేవలం దురుద్దేశం, రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేసి, రాష్ట్రంలో పోలీసులు ఓ కొత్త సంప్రదాయానికి తెర తీశారని బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఏ మాత్రం సమంజసం కాదని భవిష్యత్తులో అది వారికే ఇబ్బందిగా మారుతుందన్నది సుస్పష్టం అన్నారు. పిటిషన్‌ను సుప్రీంకోర్డు తోసి పుచ్చినా, మూడేళ్ల తర్వాత మళ్లీ రఘురామ ఫిర్యాదు చేస్తే అందులో ప్రస్తావించిన వారందరిపైనా ఇప్పుడు కేసు నమోదు చేయడం ఎంత వరకు సబబని ఆయన ప్రశ్నించారు. అసలు ఈ కేసులో జగన్ ఎలా ముద్దాయి అవుతారని బూచేపల్లి ప్రశ్నించారు.

## పారిశుధ్యం పట్ల అలసత్వం వహిస్తే చర్యలు

**ప్రజాశక్తి-కనిగిరి**

సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ పట్టణంలోని పదో వార్డు పాతూరులో ఆదివారం పర్యటించారు. అక్కడి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వార్డులోని మహిళలు చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తూ ఆ ప్రాంతంలో చెత్త సేకరణ సరిగా జరగడం లేదని, అలాగే మురుగు కాలువలు తీయడం లేదని తెలియజేశారు. శానిటరీ కార్యదర్శి అందుబాటులో లేరు. ఒకే ఒక పారిశుధ్య కార్మికుడు ఆ ప్రాంతంలో పనిచేయడాన్ని గమనించిన చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేసి రెండు రోజుల లోపల పారిశుధ్యం మెరుగుపడాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని మున్సిపల్ సిబ్బందిని హెచ్చరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పారిశుధ్యం లోపిస్తే సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, అందుకు పారిశుధ్య శాఖ బాధ్యత వహించాలని అన్నారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై కూడా శాఖాపరమైన చర్యలకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి మురళి, మాజీ వార్డు పంచాయతీ సభ్యులు నాయబ్ రసూల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపిని సున్నంబొట్లతో సాగనంపారు

### టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

**ప్రజాశక్తి-దర్శి**

దర్శి ఎమ్మెల్యేగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గెలవడం అత్యంత దురదృష్టకరంగా దర్శి ప్రజలు భావిస్తున్నారని టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ ఐదేళ్లల్లో బూచేపల్లి వలన ఈ నియోజకవర్గానికి ప్రయోజనం ఏమీ ఉండదేమోనని ప్రజలు భయపడు తున్నారన్నారు. వైసిపి ఎమ్మెల్యే ఏమీచేయలేకనే అధికార కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని దర్శి ప్రజలకు అర్ధమైపోయిందని ఆమె పేర్కొన్నారు. మోసపూరితమైన వైసీపీ ప్రభుత్వానికి నిన్నటి ఎన్నికల్లో సున్నంబొట్లు పెట్టి ప్రజలు సాగనంపారన్నారు. ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని వెంటాడిన అరిష్టం వదిలిపోయిందని ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కానీ కనీస ప్రతిపక్ష హోదా కూడా లేని వైసీపీ నాయలకు మాత్రం ఈ విషయం అర్థం కావట్లేదని అన్నారు. సాక్షి పత్రిక విషపు రాతలను స్క్రిప్టుగా చేసుకుని బూచేపల్లి మాట్లాడితే పట్టించుకుని నమ్మేందుకు ప్రజలేమీ పిచ్చోళ్లు కాదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నిండా రెండు నెలలు కూడా పూర్తి కాకమునుపే హామీల అమలుపై విమర్శిస్తారా? తల్లికి వందనం పథకంపై మీ సాక్షి తప్పుడు రాతలు రాయడం, మీ పార్టీ సోషల్ మీడియాలో విషప్రచారం చేయడం.. ఆ స్క్రిప్టు పట్టుకుని మీరు మాట్లాడటం ఏమైనా సబబుగా ఉందా..? అని ప్రశ్నించారు. పక్క పార్టీలను తిడితేనే పదవులిస్తానని చెప్పే మీ నాయకుడు జగన్ మోహన్‌రెడ్డిలా మా నాయకులు ఉండరని అన్నారు. విమర్శలకు తావులేని విధంగా పరిపాలన అందించి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని కోరుకునే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్, రాష్ట్ర యువతకు ఆరాధ్య దైవమైన నారా లోకేష్ మాకు నాయకులుగా ఉన్నారు. ప్రజలకు సేవలందించడంలో ఈ ఐదేళ్లూ అహోరాత్రులు శ్రమించాలని మాకు మా నాయకులు చెప్పి నడిపిస్తూ ఉన్నారని అన్నారు. ఇక, తల్లికి వందనం పథకానికి సంబంధించి మా ప్రభుత్వం విధివిధానాల రూపకల్పనలోనే ఉంది. దీనిపై బూచేపల్లి వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించిన ప్రధాన లబ్ధిదారు తల్లి ఆధార్ కార్డుపై ప్రభుత్వం స్పష్టంగా చెప్పడానికి మాత్రమే జీవో ఇచ్చింది. అంతేగాని, ఆ ఇచ్చిన జీవోలో ఒక బిడ్డకు మాత్రమే పథకం వర్తిస్తామని ఎక్కడా లేదు. దీనిపై లేనిపోని విమర్శలు చేసేవారు మరోసారి జీవో చదువుకుంటే మంచిదని అన్నారు. ఇక, ఇసుక పాలసీపై వైసీపీ నాయకులు మాట్లాడుతుంటే ప్రజలంతా నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లూ ఇసుకను అప్పనంగా తవ్వేసుకుని రూ.కోట్లు దోచుకుతిన్నది వైసీపీ నాయకులేనని అందరికీ తెలుసన్నారు. అలాంటి దొంగల ముఠాకు మా ప్రభుత్వం పెట్టిన ఇసుక పాలసీ గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. ఆనాడు మీ మాఫియా స్వార్థం కోసం మీ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రంలో ఉన్న 30 లక్షల మంది భవన నిర్మాణ కూలీల పొట్టకొట్టిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

ప్రజాశక్తి
7
సోమవారం 15 జులై 2024

# పల్లెకోన పంచాయతీలో రూ.30 లక్షల అవినీతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పల్లికోన పంచాయతీ కార్యాలయంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో రూ.30లక్షలకుపైగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వైసిపి పాలనలో పాల కవర్గం లేకుండానే రెండేళ్లపాటు పంచాయతీలో పనులు నిర్వహించారు. పాలకవర్గం ఏర్పడిన తర్వాత సర్పంచి సహా పంచాయతీకి వివిధ రూపాల్లో విడుదలైన నిధులను ఎలాంటి అనుమతులు, తీర్మానాలు, అంచనాలు లేకుండా వినియోగించినట్లు అధికారుల విచారణలో తేలినట్లు సమాచారం. పంచాయతీకి అవసరమైన బ్లీచింగ్, సున్నం, విద్యుత్ బల్బులు, శానిటేషన్ సామాగ్రి తదితర అవసరా లకు కొనుగోలు చేయకుండానే వినియోగించినట్లుగా నిధులు దుర్వినియోగం చేసినట్లు వ్యక్తమౌతుంది. సర్పంచి రాజమ్మ ప్రతాప్ ఆధ్వర్యంలో ఈ నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఈపాటికే సంబంధించిన అధికారుల విచారణ లో తేలింది. దీంతో పంచాయతీ శాఖ అధికారులు రికార్డు లు తనిఖీ చేయగా నిధులు దుర్వినియోగం జరిగిందని, బ్లీచింగ్, సున్నం వాడకుండానే వాడినట్లు కాంట్రాక్టర్‌కు నిధులు ముట్ట చెప్పినట్లు నిర్ధారించారు. మండలంలోని తాతవారిపాలెం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు బ్లీచింగ్, సున్నం సరఫరా వైసిపి పాలనలో కాంట్రాక్ట్ తీసు కొని సరుకు సరఫరా చేయకుండానే మంత్రి సహకారంతో పంచాయతీ నుండి నిధులు కాంట్రాక్టర్‌కు పంచాయితీ అధికారులు అప్పగించినట్లు నిర్ధారించారు. అదేతరహాలో శానిటేషన్ సామాగ్రి, విద్యుత్ బల్బులు, చేతిపంపు సామాగ్రి కూడా రేపల్లెలో ఓ దుకాణం నుండి పొంది నట్లుగా నిధులు అప్పగించారని సమాచారం. ఆ నిధులకు తగిన అనుమతులు, తీర్మానాలు, అంచనాలు లేదని అధికారుల పరిశీలనలో వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. దీనిపై త్వరలో ఉన్నతస్థాయి కమిటీ పరిశీలన జరిపి బాధ్యు లపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. అధికారుల పరిశీలనలో ముగ్గురు కార్యదర్శులు బాధ్యులుగా ఉన్నట్లు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. పూర్తి వివరాలు అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ విషయమై పంచాయితీ ఇన్‌ఛార్జి కార్యదర్శి కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయితీలో ఎలాంటి అనుమతులు లేకుండా రూ.30లక్షల నిధులు దుర్వినియోగమైన మాట నిజమేనని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు త్వరలో విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.

# నాలుగేళ్లుగా వ్యవసాయంలో నష్టాలే

## నూజిళ్లపల్లి కౌలు రైతులు ఆవేదన

ప్రజాశక్తి - పంగులూరు

గత నాలుగు సంవత్సరాలుగా వ్యవసాయంలో నష్టాలు వస్తూనే ఉన్నాయి. ప్రతి ఏటా అప్పుల పాలౌతూనే ఉన్నారు. ఖర్చులు పెట్టుబడులు తడిసి మోపెడు అవుతు న్నాయి. పెట్టుబడికి తెచ్చిన అప్పులు పెరుగుతున్నాయి. తెచ్చిన అప్పుకు వడ్డీలు పెరుగుతున్నాయి. అయినా వ్యవసాయాన్ని మానుకోవడం లేదు. ఏ ఏటికి ఆ ఏడు ఆశగా వ్యవసాయాన్ని సాగుచేస్తూనే ఉన్నారు. ఈ సంవ త్సరం కూడా వ్యవసాయానికి సిద్ధం అవుతున్నారు. మండ లంలోని నూజిళ్లపల్లి దళిత కాలనీ కౌలు రైతులు. ఆ కాలనీలో 120 కుటుంబాలు ఉన్నాయి. ఆ కుటుంబాలు అందరూ కౌలుకు భూమిని తీసుకుని సాగుచేస్తున్న రైతు కుటుంబాలే. ఈ కాలనీవాసులకు అందరికీ కలిపి సొంత భూమి 80ఎకరాల వరకు ఉంటుంది. అయితే వాళ్లు 500 ఎకరాలకుపై పైగా భూమిని సాగు చేస్తున్నారు. సొంత భూమిపోను మిగిలిన సాగుభూమి మొత్తం కౌలుకు సాగుచేస్తున్నదే. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా కౌలు రేట్లు బాగా పెరిగిపోయాయి. ఎక్కువగా మిర్చి సాగు చేస్తున్నారు. గతం నుండి ఇక్కడ మిర్చి సాగు చేయడం అలవాటు. అయితే గత నాలుగు సంవత్సరాలుగా మిర్చికి నల్లి, ఎర్రనల్లి, బొబ్బర తెగుళ్లతో పాటు సకాలంలో వర్షాలు కురవకపోవటం, తుఫాన్ కారణంగా పంట దెబ్బతింటం వంటి కారణాలతో నాలుగేళ్ల నుండి రైతులకు నష్టాలు వస్తున్నాయి. గత సంవత్సర కాలంగా మిర్చికి సరైన ధర లేకపోవడంతో కోల్డ్ స్టోరేజీలోనే మిర్చి నిల్వలు ఉన్నాయి. ఈ సంవత్సరం మిర్చి ఇంటికి వచ్చిన సమయంలో రూ.18వేలు ఉన్న ధర ఇప్పుడు కేవలం రూ.10వేలకు పడిపోయింది. మిర్చికి ధరలు లేని కారణంగా గత రెండేళ్ల

పొగాకు సాగుకు పొలం దున్నుతున్న కౌలు రైతు

కాలంగా వస్తున్న మిర్చి పంటను ఇప్పటికీ కోల్డ్ స్టోరేజీలోనే ఉంచారు. ధరలు రాకపోవడం, కోల్డ్ స్టోరేజ్ అద్దెలు పెరిగిపోవడం మిర్చి సాగు చేసిన కౌలు రైతులకు తలకు మించిన భారంగానే ఉంది. దీంతో ఏమి చేయాలో రైతులకు అర్థం కాని పరిస్థితి. ఇలా రకరకాల కారణాలతో నష్టాలు పాలౌతూనే ఉన్నారు. అయితే ఈ సంవత్సరమైనా లాభాలు రాకపోతాయా? అంటూ పట్టు వదలని విక్రమార్కుల్లా కౌలు సాగు చేస్తూనే ఉన్నారు. గత సంవత్సరం ఈ ప్రాంతంలో పొగాకు కొంత లాభదాయ కంగా ఉండటంతో ఈ సంవత్సరం ఎక్కువ శాతం పొగాకు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నామని కాలనీ వాసులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. మిర్చి సాగును తగ్గించుకొని, పొగాకు సాగు పెంచేందుకు కాలనీ కౌలు రైతులు సిద్ధం అవుతున్నారు. శనగ కూడా కొంత సాగు చేయనున్నట్లు రైతులు తెలిపారు. గత సంవత్సరం ఈ కాలనీవాసులు 100 ఎకరాల వరకు పొగాకు సాగు చేశారు. ఈ సంవ త్సరం 400ఎకరాల వరకు సాగయ్యే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తుంది. నాలుగేళ్లుగా కౌలు వ్యవసాయంలో నష్టాలను చవిచూస్తున్న కౌలు రైతులు పొగాకును భారీగా సాగు చేసి నష్టాల నుండి గట్టి ఎక్కాలని, వ్యవసాయంలోనే భవిష్యత్తు వెతుక్కునే పనిలో కౌలురైతులు ఉన్నారు.

### పొగాకు సాగుపై ఆసక్తి చూపుతున్నాం

ఆంజనేయులు, కౌలు రైతు

గత నాలుగేళ్లుగా వ్యవసా యంలో వస్తున్న నష్టాలను తగ్గించుకునేందుకు పొగా కు సాగు చేస్తున్నానని కౌలు రైతు డోల ఆంజనేయులు తెలిపారు. తనకు రెండెకరా ల సొంత భూమి ఉండగా మరో 8ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నానని చెప్పారు. పదెకరాల్లో పొగాకు ఆరెకరాలు, మిర్చి రెండెకరాలు, సెనగ రెండెకరాలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. గత సంవత్సరం రెండెకరాల్లో పొగాకు సాగు చేయగా కొంత పర్వాలేదనిపించిందని అన్నారు. అదే ఆశతోనే ఆరు ఎకరాలు సాగు చేస్తున్నానని చెప్పారు.

### మిర్చి సాగు పూర్తిగా తగ్గించాను

బుల్లెయ్య, కౌలు రైతు

ప్రతి ఏటా వచ్చే నష్టాలను దృష్టిలో పెట్టుకొని పొగాకు సాగు చేస్తున్నానని కౌలు రైతు విప్పర్ల బుల్లెయ్య చెప్పారు. తనకు సొంత భూమి అరెకరం ఉండగా, మరో ఎనిమిదిన్నర ఎకరా లు కౌలుకు తీసుకున్నానని చెప్పారు. మొత్తం 9 ఎకరా లు సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఏడెకరాలు పొగాకు, రెండెకరాలు మిర్చి సాగు చేస్తున్నానని అన్నారు. మిర్చి వల్ల నష్టపోతూనే ఉన్నామని, అందుకే ఈ సంవత్సరం నష్టాల నుండి బయట పడేందుకు పొగాకును ఎక్కువగా సాగు చేస్తున్నామని చెప్పారు.

# గంజాయి విక్రేతలు అరెస్టు

• ఆరున్నర కేజీల గంజాయి, బైకు స్వాధీనం • 10మంది అరెస్టు, ఇద్దరు పరారీ

ప్రజాశక్తి - రేపల్లె

నిషేధిత గంజాయి విక్రయిస్తున్న 10మంది వ్యక్తులను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ టి మురళీకృష్ణ తెలిపారు. తమకు అందిన సమాచారంతో మండలంలోని పెనుమూడి వంతెన వద్ద 10మంది వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆళ్ళ రాజ్‌పాల్, బంటి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద ఆరున్నర కేజీల గంజాయి, ఒక బైకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరస రాజ్ కుమార్, కోట ధనుష్ కుమార్, కోట అనిల్, భూపతి గోపీ, షేక్ ఆసిఫ్ బాబు, కైతేపల్లి శ్రీ హరినాద్, అనుమర్లపూడి నాగ సాయి, దీవి రామ మోహనరావు, షంషీర్ బేగ్‌లను స్టేషన్‌కు తరలించి ప్రధమ ముద్దాయిలైన పరస రాజ్ కుమార్, కోట ధనుష్ కుమార్, కోట అనిల్ కుమార్‌ను విచారించినట్లు డిఎస్పి తెలిపారు. అరకు, పాడేరుల్లో గంజాయిని తక్కువ ధరకు కొనుక్కుని, మిగిలిన వారికి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు, మిగిలిన వారు ఇంకా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. జల్సాలకు అలవాటు పడి డబ్బుకోసం గంజాయి అమ్ముతున్న సమాచారం తెలుసుకున్న తమ సిబ్బంది దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న ఆళ్ళ రాజ్ పాల్, బంటిలను త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐ నజీర్ బేగ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి మురళీకృష్ణ

# బాలుడు కిడ్నాప్ అవాస్తవం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

సిఐ రాజశేఖరరెడ్డి

బాలుడు కిడ్నాప్‌కు గురయ్యాడంటు కొన్ని దినపత్రికల్లో (ప్రజాశక్తి కాదు) వచ్చిన వార్తలు అవాస్తవమని అర్బన్ సిఐ ఎస్‌వి రాజశేఖరరెడ్డి తెలి పారు. ఆయన మీడియాతో ఆదివారం మాట్లాడారు. స్థానిక మధు టీ స్టాల్ సమీపంలో సెల్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తి తన పదేళ్ల కుమారుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి శనివారం రాత్రి కిడ్నాప్ చేసి తీసుకెళ్ళ తుండగా బాలుడు సమయస్ఫూర్తితో దుండగుల చెర నుండి తప్పించుకొని తిరిగి ఇంటికి వచ్చాడని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడంతో వెంటనే సిబ్బందితో దర్యాప్తు చేశామని తెలిపారు. సిసి పుటేజ్ పరిశీలించగా బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో ఎటువంటి వాస్తవం లేదని వెల్లడైందని తెలిపారు. బాలుడిని విచారించగా స్నేహితులతో కలిసి ఆడుకో వడానికి వెళ్లి తిరిగి ఇంటికి ఆలస్యంగా వెళ్లడంతో తల్లి మందలిస్తుందనే భయంతో బైక్‌పై వచ్చిన కొంత మంది వ్యక్తులు తనను మత్తుమం దు చల్లి కిడ్నాప్ చేశారని చెప్పినట్లు తెలిపారు. తనను ఇంట్లో ఏమి అనరనే ఉద్దేశంతో అలా చెప్పానని విచారణలో బాలుడు చెప్పినట్లు సీఐ తెలిపారు. చిలకలూరిపేటలో 6వ తరగతి చదువుతున్న బాలుడు స్నేహి తులతో ఆడుకోవడానికి వెళ్లి ఆలస్యం గా ఇంటికి వెళ్లడంతో తల్లి మందలి స్తుందనే భయంతో కిడ్నాప్ కథ అల్లిన ట్లు సీఐ తెలిపారు. కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో వాస్తవాలు తెలు సుకోకుండా, తమ వివరణ అడగ కుండా కిడ్నాప్ జరిగిందంటూ ప్రజల ను భయభ్రాంతులకు గురయ్యేలా తప్పుడు వార్తలు ప్రచురించడం మంచిదికాదని అన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ఒత్తిడికి గురి చేయకుండా రక్షించుకోవాలని అన్నారు.

# మేదరమెట్లలో తొలి నేత్రదానం

ప్రజాశక్తి - మేదరమెట్ల, అద్దంకి

మేదరమెట్ల గ్రామానికి చెందిన విశ్రాంత పశువైద్య శాఖ ఉద్యోగి శంఖుల ప్రసాదలింగం (75) ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యుల సమ్మతి మేరకు రోటరీ క్లబ్ కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, అధ్యక్షులు చప్పిడి వీరయ్య, పెదకాకాని శంకర్ కంటి ఆస్పత్రిని సంప్రదించగా డాక్టర్ చిన్మయ్ బృందం వచ్చి మృతుడి కార్నియాలను సేకరించి కంటి ఆస్పత్రికి తరలించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 209వ నేత్రదానమని తెలిపారు. నేత్ర దానం వలన మరణం అనంతరం కూడా ఇద్దరికి దృష్టి ప్రసాదించినట్లవుతుందని, నేత్ర దానానికి అంగీకరించిన మృతుని కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, కె నాగయ్య, సామాజిక సేవకుడు రాచమల్లు శివ పాల్గొన్నారు.

# తమిళనాడు బిఎస్‌పి అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌కు నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

తమిళనాడు బిఎస్‌పి అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది ఆర్మ్‌స్ట్రాంగ్‌ను దుండగులు ఆయన ఇంటిలోకి ప్రవేశించి ఈనెల 5న కత్తులతో దారుణంగా హత్య చేశారని బిఎస్‌పి నాయకులు పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్లో బీఎస్పీ ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు ఆర్మ్‌స్ట్రాంగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఆదివారం నివాళి అర్పించారు. దొంగలు, రౌడీషీటర్లు, కబ్జాకోరులను కోర్టుకు లాగి పేదలకు అండగా నిలబడిన ఆర్మ్‌స్ట్రాంగ్‌ను కిరాయి హంతకులచే హత్య గావించడం దారుణమైన విషయమని అన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ అధ్యక్షులు మంద జోసెఫ్, ఎస్‌సి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నక్క కాంతారావు, ఎపి ఎస్‌సి, ఎస్టి, బిసి, మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు, జై భీంరావు పార్టీ అధ్యక్షులు పులిపాటి హేబెలు, పూనూరి నరేంద్ర, మంచు హనుమంతరావు, రోషన్ బాబు, రోశయ్య పాల్గొన్నారు.

# నిధులు లేక విధులకు ఆటంకం

ప్రజాశక్తి - రేపల్లె

నిధులు లేక పంచాయతీలో విధులకు ఆటంకం కలుగుతుంది. గత 2023- 24 సంవత్సరం మండలం లోని పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తుకు చెల్లించ వలసిన నిధులు విడుదల కాకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడింది. రిజిస్ట్రేషన్ సర్ చార్జీ ద్వారా పంచాయతీలకు రావాల్సిన 50శాతం నిధులు రూ.71.54 లక్షలు, మండల పరిషత్తుకు 25శాతం రూ.23.85లక్షలు, జిల్లా పరిషత్తుకు 25శాతం రూ.23.85లక్షల నిధులు ఏడాది కాలంగా రిజిస్ట్రేషన్ శాఖ విడుదల చేయలేదు. దీంతో గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధి నిధులు లేక కుంటు బడిందని పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. గత ప్రభుత్వ నిర్వాహకం వల్ల పంచాయతీలో పారి శుధ్యం లోపించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వర్షాలు సీజన్ ప్రారంభమైన కనీసం పారిశుధ్య పనులు చేసేందుకు కూడా పంచాయతీల్లో నిధులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచులు చెబుతున్నారు. అత్యవసర పనులకు కార్యదర్శులు నిధులు సమకూర్చుకునేందుకు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. పారిశుద్య కార్మికులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదని చెబుతున్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గేదెల చావిడి దగ్ధం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గేదెల చావిడి దగ్ధమైన ఘటన ఆదివారం తెల్లవారు జామున మండలంలోని గుళ్ళపల్లిలో జరిగింది. గ్రామంలోని కురపాపాలెంకు చెందిన బక్క సాంబయ్య గేదెల చావిడి ప్రమాదవశాత్తు పూర్తిగా కాలిపోయింది. కొష్టంలో ఉన్న గేదె, దూడలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వాటి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. సుమారు రూ.లక్షలకుపైగా నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

# అంబేద్కర్ ఆడిటోరియం నిర్మించాలి

## మంత్రి డిబివి స్వామికి వినతి

మంత్రికి పుష్పగుచ్చం అందజేస్తున్న బిళ్లా చెన్నయ్య

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ఒంగోలు నగరంలో అంబేద్కర్ ఆడిటోరియం, స్టడీ సర్కిల్ నిర్మించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయో వృద్ధులు, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామిని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్ళా చెన్నయ్య కోరారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి నివాసంలో ఆదివారం మంత్రిస్వామిని మర్యాద˘పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ రిలీఫ్ ఫండ్ విడుదల చేయాలని కోరారు. పేదల భూములను ఆక్రమించుకున్న పెత్తందార్ల దౌర్జన్యాలను అరికట్టాలని, ప్రభుత్వం నుంచి దళిత ప్రజలకు అన్ని పథకాలను అందజేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల నాయకుల సమావేశం

**ప్రజాశక్తి-టంగుటూరు :** టంగుటూరు రైల్వే స్టేషన్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైల్వే అభివృద్ధిని స్వాగతిస్తూ ప్రజలందరూ సహకరించాలన్నారు. టంగుటూరు గ్రామానికి సంబంధించిన ప్రజలెవరూ ఇబ్బంది పడకూడదన్నారు. తప్పని సరిగా ఇబ్బందిని ఎదుర్కోవాల్సి వస్తే ఆ పరిస్థితి వీలైనంత తక్కువగా ఉండేటట్లు అధికారులు, స్థానిక సంస్థల నాయకులు ప్రజలు కలిసి పరిష్కరించుకుందామని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రతినిధి కాలేషా బేగ్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బొడ్డు సతీష్, వైసిపి ప్రతినిధి కొమ్ము బుజ్జి, బిఎస్‌పి ప్రతినిధి బద్దిపూడి ఉదయ్, సిపిఎం ప్రతినిధి టంగుటూరి వెంకట్రావ్, సిపిఐ ప్రతినిధి ప్రభాకర్ పాల్గొన్నారు.

# ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అకాడమీ సభ్యులు

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న 51వ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ సెలక్షన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఆదివారం నిర్వహించిన అండర్-11 బాలుర సింగిల్స్‌లో విజేతగా ఆఫ్రాన్, ఉప విజేతగా ఆర్యనందన్ నిలిచారు. బాలుర డబుల్స్‌లో విన్నర్‌గా అఫ్రాన్, రన్నర్‌గా కుషాల్ శ్రీ గెలుపొందారు. .బాలికల సింగిల్స్‌లో విజేతగా రబియా, ఉప విజేతగా ఇషిత నిలిచారు. బాలికల డబుల్స్‌లో విన్నర్స్‌గా రబియా ఇషిత, రన్నర్స్‌గా ఆరాధ్య, స్కంద గెలుపొందారు. అండర్- 13 బాలుర సింగిల్స్‌లో విజేతగా జి.షణ్ముఖ వర్ధన్, ఉప విజేతగా శ్రయాష్ గెలుపొందారు. బాలుర డబుల్స్ లో షణ్ముక్, అక్షాజ్ విన్నర్స్‌గా, ఎస్‌కె ఆఫ్రాన్,, కుషాల్ రన్నర్స్‌గా నిలిచారు. బాలికల సింగిల్స్‌లో ఎస్. మనస్వీ విజేతగా, ఆశశ్రీ ఉప విజేతగా గెలిచారు. డబుల్స్ లో ఎస్‌కె రబియా, ఇషిత విన్నర్స్‌గా, ఆరాధ్య, స్కంద రన్నర్స్ గా గెలు పొందారు. అండర్- 15 బాలుర సింగిల్స్ లో షణ్ముఖ్ విజేతగా శ్రయాష్ రన్నర్‌గా నిలిచారు. బాలుర డబుల్స్‌లో అనుప్ నాయక్, జి.విమల్ విజేతలుగా, వినయ్, విపిన్ రన్నర్స్ గా గెలిచారు. బాలికల సింగిల్స్‌లో మనస్వి విజేతగా, ఆషాశ్రీ ఉప విజేతగా నిలిచారు. బాలికల డబుల్స్ లో డి. ఆషశ్రీ, ఎస్.మనస్విని విన్నర్స్‌గా, మౌనిక, త్రిభువన్ శ్రీ రన్నర్స్‌గా గెలుపొందారు. అండర్-16 బాలుర సింగిల్స్ లో తారక్‌రామ్ చరణ్ విజేతగా వెంకట్ సాయి వర్షిత్ ఉప విజేతగా నిలిచారు. బాలుర డబుల్స్‌లో అభిలాష్, రిషి విన్నర్స్‌గా, తారక్ రామ్ చరణ్, ప్రేమ్ కుమార్ రన్నర్స్‌గా గెలిచారు. బాలికల సింగిల్స్‌లో కెసరియా విజేతగా, నితిక ఉప విజేతగా గెలుపొందారు. .డబుల్స్‌లో శ్రీజ, మనస్వి విజేతలుగా నిలిచారు. అండర్-19 బాలుర సింగిల్స్‌లో శ్రీధర్ రెడ్డి విజేతగా, సూర్య కిరణ్ ఉప విజేతగా గెలుపొందారు. బాలుర డబుల్స్‌లో సూర్య కిరణ్, అభిలాష్ విన్నర్స్‌గా, విమ సాయి, రిషి రన్నర్స్‌గా నిలిచారు. బాలికల సింగిల్స్ లో సరయు విజేతగా శ్రీజ ఉప విజేతగా గెలిచారు. మెన్స్ సింగిల్స్‌లో పి. సుమంత్, డబుల్స్‌లో పి. సుమంత్,శశిధర్ విజేతలుగా నిలిచారు. ఉమెన్ సింగిల్స్‌లో కె.సరయు విజేతగా, అనుశ్రీ ఉప విజేతగా గెలిచారు. ఉమెన్ డబుల్స్ లో సౌమ్య, మౌనిక విన్నర్స్‌గా, అనుశ్రీ, నందిని రన్నర్స్‌గా నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో డి.వసంత రావు, కె.సరయు విజేతలుగా ఎస్‌కె.కలాం, ,వైష్ణవి ఉపవిజేతలుగా నిలిచారు. విజేతలు, ఉప విజేతలకు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీ కృష్ణ ట్రోఫీ లుఅందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ రెడ్డి, కార్యదర్శి పి. విజయ్, రవిబాబు, రఘు, శ్రీనివాసరావు పాల్గొన్నారు

## మత్తు పదార్థాల ప్రయోగంపై

# సమగ్ర విచారణ జరిపించాలి

## ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ డిమాండ్

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

విద్యార్థిపై మత్తు పదార్థాల ప్రయోగం ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్. వినోద్ డిమాండ్ చేశారు. విద్యార్థులను కేంద్రంగా చేసుకుని చాప కింద నీరులా వస్తున్న డ్రగ్స్ రాకసి నుంచి విద్యార్థులు, యువకులను కాపాడుకోవాలని కోరారు. ఒంగోలులోని ఓ కాలేజీ విద్యార్థిపై మత్తు పదార్థాల ప్రయోగం జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయని, పత్రికలు, టివి ఛానళ్ళల్లో విస్తత ప్రచారం జరుగుతుందన్నారు. నెల్లూరు జిల్లా ఉలవపాడుకు చెందిన 18 ఏళ్ల యువకుడు ఒంగోలులోని వీనస్ కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం పూర్తయి, నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాడన్నారు. గత సోమవారం కళాశాలకు వెళ్లేందుకు ఒంగోలు ఆర్‌టిసి బస్టాండులో బస్సు దిగి మిత్రులతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో అనుమానాస్పద స్థితిలో ప్రమాదానికి గురయ్యాడన్నారు. కళాశాల వద్దకు వెళ్లిన యువకుడికి తొలుత ఇద్దరు యువకులు తోడయ్యారని, ఆ తర్వాత మరో ఇద్దరు కలిసి అతడిపై ఏదో మత్తు పదార్థాన్ని ప్రయోగించారనేది బంధువుల ఆరోపణ అని ఈ ఘటనపై పోలీసు విచారణ జరిపించాలన్నారు. ఒంగోలు నగరంలో విద్యార్థులను కేంద్రంగా చేసుకుని మత్తు పదార్థాల వ్యాపారం ముమ్మరంగా జరుగుతుందని, వాటికి బానిసలైన యువకులు రోడ్లపై, వాహనాలతో విహారం చేస్తున్నారని గొడవలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ ఉదంతంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

బిలాల్ నగర్ ముస్లిం కమ్యూనిటీ హాలు నిర్వహణకు ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ ముస్లిం నాయకులు పఠాన్ హనీఫ్ ఖాన్, కఫిల్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 లో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు బిలాల్ నగర్‌లోని కమ్యూనిటీ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించి ముస్లింల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దారన్నారు. ఒక మోస్తారు వివాహా, ఇతర వేడుకలకు అందుబాటులో ఉంచడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారన్నారు. మొదటి అంతస్తు నిర్మాణంతో ఇతర మౌలిక సదుపాయల కల్పన కోసం ఆదివారం కొత్త కమిటీని ఎన్నుకున్నారని, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అధ్యక్షుడిగా షేక్ గౌస్ బాషా, కార్యదర్శిగా సయ్యద్ రవూఫ్, కోశాధికారిగా షేక్ ఇమ్రాన్, ఉపాధ్యక్షుడిగా షేక్ అల్లాబక్షు,కార్య నిర్వాహక కార్యదర్శి, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# 'సూపర్ స్పెషాలిటీ' వైద్యసేవలే ధ్యేయం

- ఒపి సంఖ్య పెంచేందుకు చర్యలు
- పారిశుధ్య మెరుగుదలకు కృషి
- త్వరలో తీరనున్న ఫిజీషియన్ల కొరత
- జిజిహెచ్ ఇన్‌ఛార్జి ఆర్ఎంఒ వి.చెంచయ్య



**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు 'సూపర్ స్పెషాలిటీ' వైద్యసేవలు అందించటమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జిజిహెచ్ ఇన్‌ఛార్జి ఆర్ఎంఒ డాక్టర్ వి.చెంచయ్య తెలిపారు. రోగులకు అవసరమైన మంచినీటి సదుపాయాన్ని కల్పిస్తున్నామని, పారిశుధ్య మెరుగుదలకు కృషి చేస్తున్నామన్నారు. జిజిహెచ్‌కు పీజీ సీట్లు కేటాయించటంతో మెడిసిన్ ఫిజీషియన్ల కొరత తీరనుందన్నారు. నిర్మాణంలోని వివిధ విభాగాల భవనాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిజిహెచ్‌లో రోగులు కల్పిస్తున్న సదుపాయాలు, ఇతర చర్యలను ఇన్‌ఛార్జి ఆర్ఒఎం ప్రజాశక్తికి వివరించారు. ఆ విశేషాలన్ని ఆయన మాటలల్లోనే....

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు అన్ని రకాల నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నాం. కలెక్టర్, జిజిహెచ్ ఛైర్‌పర్సన్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. వివిధ విభాగాధిపతులు, వైద్యులతో సమావేశాలు నిర్వహించి జిల్లావ్యాప్తంగా వచ్చే రోగులకు వైద్యసేవలు అందించటంతో పాటు వారితో మర్యాదగా నడుచుకునేలా చర్యలు చేపట్టాం.

**ఒపి సంఖ్య మరింత పెంచేందుకు చర్యలు**

జిజిహెచ్‌కు వచ్చే రోగుల సంఖ్య మరింత పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం. నిత్యం జిజిహెచ్‌కు 700 నుంచి 800 అవుట్ పేషెంట్లు వస్తున్నారు. ఇన్ పేషెంట్స్ రోజుకి 500 మంది వస్తున్నారు. అవుట్ పేషెంట్లు సంఖ్యను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రోగులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు చేపట్టాం. ఆర్ఒ ప్లాంట్ ద్వారా రోగులకు సురక్షిత మంచినీరు అందిస్తున్నాం.

## ముఖాముఖి

**పారిశుధ్యం మెరుగుదలకు కృషి**

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నాం. ఏజెల్స్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 100 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఈ సంస్థ గడువు తీరటంతో మరో 2 నెలలు కాలపరిమితిని పొడిగించారు. పారిశుధ్య కార్మికులు నిత్యం ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా పనిచేస్తున్నారు. రోగులలో పారిశుధ్య నిర్వహణపై చైతన్యం పెరగాల్సిన అవసరం ఉంది. కారిడార్‌లో రాత్రి సమయాలలో వాటర్ బాటిళ్ళు, చెత్తా చెదారం వేస్తున్నారు. దీంతో ఉదయం నాటికి కారిడార్స్‌లో చెత్తా చెదాం, వాటర్ బాటిళ్ళు ఉంటున్నాయి. ఆయా వార్డుల పరిధిలో చెత్త కుండీల ఏర్పాటు, చెత్త ఎక్కడ వేయాలనే విషయమై బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

**సీజనల్ వ్యాధులకు చికిత్స**

జిజిహెచ్‌లో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, డయేరియా, వైరల్ ఫీవర్స్‌కు చికిత్సను అందిస్తున్నాం. ఇటీవల 4 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదు కావటంతో వారికి ఐవి ఫ్లూయిడ్స్, వైద్యం అందించి ఇంటికి పంపాం. డయేరియా కేసులకు వైద్య చికిత్స అందించాం. వైరల్ ఫీవర్స్, సాధారణ జ్వరాలు, జలుబు, దగ్గు వంటి వ్యాధులతో వచ్చే రోగులకు వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు

**రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు**

జిజిహెచ్‌కు వస్తున్న రోగులకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందిస్తున్నాం. యూరాలజీ, న్యూరో సర్జరీ, న్యూరాలజీ, ట్రామా కేర్, కార్డియాలజీ, నెఫ్రాలజీ వంటి సేవలు అందిస్తున్నాం. రోగులకు అందిస్తున్న సేవలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నాం.

**త్వరలో తీరనున్న ఫిజీషియన్ల కొరత**

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసిఐ) జిజిహెచ్‌కు 6 పీజీ సీట్లు(ఎమ్‌డి జనరల్ మెడిసిన్) మంజూరు చేసింది. దీంతో మెడిసిన్ ఫిజీషియన్ల కొరత తీరనుంది. అనస్తీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరో సర్జరీ వంటి ఫిజీషియన్లు ఆగస్టు- సెప్టెంబర్ నాటికి అందుబాటులోకి రానున్నారు.